- వార్త మెయిన్‌లో

కేశవరావు శవాన్ని చూసి భయపడుతున్న ప్రభుత్వాలు

- మావోయిస్టు మృతదేహాలను తక్షణమే బంధువులకు అప్పగించాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.హరినాథ్ రెడ్డి డిమాండ్

విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

మంగళవారం 27, మే 2025 8 పేజీలు

చరిత్రలో నిలిచిపోయేలా 'మహానాడు'

- చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు

విశాలాంధ్ర-చిత్తూరు: చరిత్రలో నిలిచిపోయేలా కడపలో మహానాడును నిర్వహించనున్నట్లు చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు తెలిపారు. కడప వేదికగా ఈనెల మంగళవారం నుంచి మూడు రోజులు పాటు జరగనున్న మహానాడు ఏర్పాట్లను సోమవారం చిత్తూరు ఎంపీ టీడీపీ శ్రేణులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడపలో జరిగే ఈ మహానాడుకు ఓ ప్రత్యేకత ఉందన్నారు. టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న మహానాడుకు గొప్ప చారిత్రక నేపథ్యం ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహానాడును ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించడం తెలుగు దేశం పార్టీకి, పార్టీ శ్రేణులకు గర్వకారణంగా నిలుస్తోందని ఆయన తెలియజేశారు. కడప గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా మహానాడును జయప్రదం చేయడమే తమ లక్ష్యమని తెలిపారు.

విశాఖ ఉక్కు పరిశ్రమ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

- తొలగించిన ఉక్కు కార్మికులను తిరిగి పనిలోకి చేర్చుకోవాలి
- విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేయనని అసెంబ్లీలో తీర్మానం చేయాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.హరినాథ్ రెడ్డి డిమాండ్

విశాలాంధ్ర-తిరుపతి: లాభాలు తెస్తున్న విశాఖ ఉక్కు పరిశ్రమకు మరింత అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం నుంచి పెద్ద ఎత్తున నిధులు కేటాయించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటు పరం చేయబోమని అసెంబ్లీలో తీర్మానం చేయాలని తొలగించిన 4,000 మంది కాంట్రాక్ట్ ఉక్కు కార్మికులను తిరిగి విధుల్లోకి చేర్చుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వారికి సభ్యులు హరినాథ్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం అన్ని కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నా పిలుపులో భాగంగా తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏఐటియుసి, సిఐటియు, ఐఎఫ్టియు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా జరిగింది. ఈ ధర్నా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పీ హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ విశాఖ ఉక్కు కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపును ఈ రాష్ట్రంలో వామపక్ష పార్టీలు ప్రతిపక్ష పార్టీలో తీవ్రంగా వ్యతిరేకిస్తూ నాలుగువేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కార్మికుల చేస్తున్న పోరాటానికి మద్దతు ప్రకటించారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటు కార్పొరేట్లకు అమ్ముతున్నారని రాష్ట్ర ప్రజానీకం ఆందోళన చెందుతుందన్నారు. అందుకోసమే పరిశ్రమ ప్రైవేటీకరణ

-2లో

శ్రీసిటీని సందర్శించిన థాయిలాండ్ కాన్సుల్ జనరల్

విశాలాంధ్ర-సత్యవేడు: చెన్నైలోని రాయల్ థాయ్ కాన్సుల్ జనరల్ రాచా అరిబార్గ్ సోమవారం శ్రీసిటీని సందర్శించారు. తన భార్య నరఫాన్ అరిబార్గ్, కాన్సుల్ పిన్‌పాంగ్ చౌవాచాటాతో కలసి రెండు రోజుల పర్యటనకు విచ్చేసిన ఆయనకు శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్ సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీసిటీ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ (బిజినెస్ డెవలప్‌మెంట్) బోడ్గన్ జార్జ్ శ్రీసిటీలోని థాయిలాండ్ పరిశ్రమ రాక్‌వర్త్ స్థాపన, ప్రస్థానాన్ని కాన్సుల్ జనరల్ బృందం దృష్టికి తెచ్చారు. శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలు, అంతర్జాతీయ మౌళిక సదుపాయాలు, పారిశ్రామిక అనుకూల వాతావరణం మరియు వ్యాపార ప్రయోజనాలను వారికి వివరించారు. అలాగే రాష్ట్ర పారిశ్రామిక విధానం, తద్వారా నిర్మితమవుతున్న బలమైన తయారీ పర్యావరణ వ్యవస్థ గురించి కూడా వివరించారు. థాయిలాండ్ వ్యాపార ప్రతినిధులు శ్రీసిటీలోని వ్యాపార అవకాశాలను వీక్షించేలా చొరవ చూపాలని కాన్సుల్ జనరల్‌ను కోరారు. భారత్-థాయ్‌లాండ్ వ్యాపార సంబంధాలను పెంపొందించడంలో ఈ సందర్శన కీలక పాత్ర పోషిస్తుందన్న శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, దేశంలో మరిన్ని థాయ్ కంపెనీల రాకకు ఇది దోహద పడుతుందని తన ప్రకటనలో ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలోని బలమైన పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థకు ప్రతిబింబంగా శ్రీసిటీని అభివర్ణించిన

ఆయన, రెండు దేశాల మధ్య ఆర్థిక భాగస్వామ్యాన్ని మరింతగా పెంచడంలో శ్రీసిటీ అర్థవంతమైన పాత్ర పోషిస్తుందన్నారు. శ్రీసిటీ వేగవంతమైన అభివృద్ధి, ప్రపంచ స్థాయి మౌళిక సదుపాయాలను అభినందించిన అరిబార్గ్,దీనిని ప్రపంచ పెట్టుబడులకు అనువైన అభివృద్ధి కేంద్రంగా వ్యాఖ్యానించారు. ఇక్కడ నెలకొన్న పెట్టుబడిదారుల అనుకూల వాతావరణం థాయ్ పారిశ్రామికవేత్తలను విశేషంగా ఆకర్షిస్తాయని అభిప్రాయపడ్డారు. భారతదేశంలో అవకాశాలను అన్వేషిస్తున్న థాయ్ వ్యాపారవేత్తలకు తప్పక శ్రీసిటీని సిఫార్సు చేస్తానని పేర్కొన్నారు.మొదటి రోజు పర్యటనలో శ్రీసిటీ అధికారులతో చర్చలు, పారిశ్రామికవాడ పరిసరాల వీక్షణతో పాటు స్థానిక రాక్‌వర్త్, మోండెలెజ్ పరిశ్రమలను ఆయన సందర్శించారు. కంపెనీ ప్రతినిధులతోను సమావేశమయ్యారు. రెండవ రోజు పర్యటనలో బ్లూస్టార్, మురుగప్ప గ్రూప్ కంపెనీలను ఆయన సందర్శించనున్నారు.

శ్రీవారి భక్తుల కోసం రైల్వే - టీటీడీ సమన్వయం

విశాలాంధ్ర-తిరుపతి: తిరుమల శ్రీవారి దర్శనానికి టిటిడి ఇటీవల ఆగస్టు నెల ఆన్లైన్ కోటాను విడుదల చేసింది. దేశ విదేశాల నుంచి వేలాది మంది భక్తులు క్షణాల్లోనే టికెట్లు బుక్ చేసుకున్నారు. గతంలో ఎన్నో ప్రయత్నాలు చేసినా టికెట్లు దక్కని భక్తులు, ఈసారి పొందడంతో భగవద్భక్తితో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇది దేవుని అనుగ్రహంగా భావిస్తున్నారు. ఆగస్టు నెల టిటిడి దర్శన టికెట్లు పొందిన భక్తులు, రైల్వే రిజర్వేషన్ టికెట్లు జూన్‌లో బుక్ చేసుకోవచ్చు. శ్రీవారి దర్శనార్థం తిరుమలకు చేరుకునే భక్తుల సౌలభ్యం కోసం రైల్వే శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. తక్కువ ఖర్చుతో, సౌకర్యవంతంగా ప్రయాణించే మార్గంగా రైలు ప్రయాణం ఉత్తమ ఎంపికగా నిలుస్తోంది. భక్తుల రద్దీ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని, వివిధ ప్రాంతాల నుంచి తిరుపతికి ప్రత్యేక రైళ్లను నడిపేందుకు రైల్వే శాఖ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఉన్నతాధికారుల సమన్వయంతో తగిన ఏర్పాట్లు జరుగుతున్నాయని తిరుపతి రైల్వే స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ తెలిపారు. తాత్కాలికంగా నడిపే ఈ ప్రత్యేక రైళ్ల ద్వారా భక్తులు సులభంగా రైలు టికెట్లు పొందవచ్చని, ఎలాంటి నిరుత్సాహం అవసరం లేదని రైల్వే అధికారులు తెలిపారు.

నిధులు కేటాయించాలి

(మొదటి పేజీ తరువాయి) చేయకూడదని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని ప్రజల ఆకాంక్షని ఆయన అన్నారు. చంద్రబాబు నాయుడు ఎన్నికలలో ప్రచారంలో భాగంగా విశాఖ ఉక్కు కార్మికులకు నేను అండగా ఉంటానని హామీ ఇచ్చారు కాబట్టి విశాఖ ఉత్తరాంధ్రలో పెద్ద ఎత్తున ఆదరణ లభించిందని ఆ ప్రజలను, కార్మికులను మోసం చేయడం చంద్రబాబు నాయుడుకి తగదని హెచ్చరించారు ఉక్కు పరిశ్రమకు కంటి తుడుపు చర్యగా ఒకపక్క నిధులు కేటాయించమని చెబుతూనే రెండో పక్క దీన్ని నేరుగాచడానికి ప్రయత్నించి పరిశ్రమను నేచురల్ డెత్ లోకి నెట్టి పరిశ్రమ నష్టాల ఊబిలో కూలికిపోతున్నదని చెప్పి ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించాలని చంద్రబాబు నాయుడు చూస్తున్నారని ఈ కుట్రను ప్రజలు తిరుగుబాటు చేసి భగ్నం చేయాలని అన్నారు చంద్రబాబు నాయుడుకి ఏమాత్రం సిద్ధిసిద్ధి ఉన్న ఉక్కు పరిశ్రమను ప్రైవేటు కరణ చేయబోమని అసెంబ్లీలో చర్చించి తీర్మానం చేయాలని ఆయన డిమాండ్ చేశారు ఈ సమస్య పరిష్కారం కోసం చంద్రబాబు నాయుడు ప్రతిపక్ష పార్టీలన్నింటినీ ఏకం చేసి మోడీతో చర్చలకు ఆహ్వానించాలని ఆయన కోరారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటుకరించిన కార్మికులను విధుల్లోకి తీసుకోకపోయినా జరిగే పరిణామాలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఈ సందర్భంగా హెచ్చరించారు సిఐటియు జిల్లా అధ్యక్షులు బాలసుబ్రమణ్యం ఐఎఫ్టియు జిల్లా నాయకులు వెంకటరత్నం మాట్లాడుతూ మోడీ చంద్రబాబు నాయుడు ప్రైవేటు వ్యక్తుల కార్పొరేటర్లకు అనుకూలంగా చేస్తున్నారు తప్ప ప్రజా సమస్యలు పట్టించుకోవడంలేదని తీవ్రంగా మండిపడ్డారు కేంద్రంలో నరేంద్ర మోడీ కార్పొరేట్లకు ఆడవాళ్ళని అప్పగించాలనే ప్రయత్నంలో భాగంగానే కగార్ ఆపరేషన్ చేపట్టారని అందుకు ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా తలూపుతూ అంతర్గతం గా మద్దతు ప్రకటిస్తు న్నారని తెలిపారు ఆంధ్ర రాష్ట్రం విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదంతో ఎంతోమంది త్యాగాల ఫలితంగా సాధించుకున్న పరిశ్రమను కాపాడుకు నేంతవరకు పోరాటం కొనసాగుతుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాకృష్ణ ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య ఏఐటియుసి జిల్లా ఆఫీస్ బేరర్స్ ఉదయ్ కుమార్ మహేంద్ర గోవింద స్వామి వైయస్ మణి అల్లాబక్షు శ్రీనివాసులు పార్వతి సిఐటియు నాయకులు జై చంద్ర సుబ్రహ్మణ్యం వేణు మాధవ్ కృష్ణ బుజ్జి సుమన్ ఐఎఫ్టియు నగర నాయకులు లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠ పోరులో

హైపీరియన్ జట్టు విజయం

విశాలాంధ్ర-తిరుపతి: మధ్యాహ్నం రాయల్ చాలెంజ్ వర్సెస్ హైపీరియన్ మధ్య జరిగిన ఉత్కంఠ పోరులో హైపీరియన్ జట్టు విజయం సాధించింది. మ్యాచ్ మొదటి విన్నింగ్స్ మధ్యలో వర్షం కారణంగా డక్వర్ లూయిస్ ప్రకారం మ్యాచ్ ను 16 ఓవర్లకు కుదించారు. నిర్ణీత 16 ఓవర్లలో రాయల్ ఛాలెంజ్ తిరుచానూరు జట్టు 4 వికెట్లు కోల్పోయి 161 పరుగులు చేసింది.బ్యాటింగ్లో శశాంక్ శ్రీనివాస్ కేవలం 45 బంతులలో 7 సిక్సర్లు, 7 ఫోర్ల సాయంతో 93 పరుగులతో రాణించాడు.బౌలింగ్ లో అచ్యుతానంద రెండు వికెట్లు తీసుకున్నారు. అనంతరం 162 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన హైపీరియన్ జట్టు 38 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో ఉన్న సమయంలో పృధ్విరాజ్ 89(45), హర్షారెడ్డి 53(29)విజృంభించి అడి అఫ్ సెంచరీలతో కదం తొక్కారు. దీంతో ఉత్కంఠంగా జరిగిన ఈ మ్యాచ్ లో హైపీరియన్ జట్టు 14.5 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 167 పరుగులు చేసి విజయం సాధించింది. కష్ట సమయంలో 89 పరుగులతో రాణించిన పృధ్విరాజ్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కించుకున్నారు. మెడిగో డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ్, రంజీ ప్లేయర్ ఎలిజర్, కోచ్ అనిత పృధ్విరాజ్ కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందజేశారు.

భూ కబ్జాదారులపై ఉక్కుపాదం

విశాలాంధ్ర-చౌడేపల్లి: మండలం లోని 19 గ్రామ పంచాయతీ లలో ఎక్కడ చూసినా అసైన్మెంట్ భూములు గతం లో విచ్చల విడిగా అమ్మడం,కొనడం జరిగింది. అంతే కాకుండా సదరు అసైన్మెంట్ భూములు ఇతర కులస్తులకు కూడా అమ్మడం జరిగినది.ఐతే అసైన్మెంట్ ఆక్ట్ 1977 ప్రకారం అసైన్మెంట్ భూమిని వంశపారంపర్యంగా అనుభవించు కోవాలి,ఇతరులకు అన్యాక్రాంతం చేయకూడదు. అలా చేసిన యెడల అసైన్మెంట్ పెట్టాను సంబంధిత తాహాశిల్దార్ రద్దు పరచవచ్చు ను.అంతే కాకుండా అసైన్మెంట్ ఆక్ట్ ప్రకారం ఎవరైతే డి.ఫాం పట్టా పొంది నాలుగైదు సంవత్సరాలు భూమిని సాగు చేయకుండా వదిలి వేస్తారో అటువంటి భూములను కూడా రద్దు చేసే అధికారము తాహాశిల్దార్ కు ఉంటుంది. ఐతే ఏ భూమిని ఐతే రద్దు పరుస్తున్నారో ఆ భూమికి సంబంధించిన డిఫాం పట్టాదారు కు గాని, వారి వారసులకు గాని ముందస్తుగా నోటీసులు ఇచ్చి తర్వాత సదరు పెట్టాను రద్దు పరచాలి. ఆ తర్వాత సదరు భూమిని అనాధీనంగా మార్చాలి.అనాధీనంగా మార్చిన తర్వాత ఎవరైనా సదరు భూమికి పట్టా కోసం దరఖాస్తు చేసుకుంటే గ్రామ పంచాయతీ కార్యాలయం లో నోటీసు బోర్డులో సదరు భూమి తాలుకూ వివరాలు ఉంచాలి. అప్పటికీ ఎవరూ ఆక్షేపణ చేయకపోతే అప్పుడు డి.ఫాం పట్టా ఇవ్వడానికి సిఫార్సుచేసి సదరు భూమి తాలుకు వివరాలు అసైన్మెంట్ కమిటీ దృష్టిలో ఉంచాలి. అసైన్మెంట్ కమిటీ ఆమోదం తెలిపిన పిదప డి.ఫాం పట్టా ఇవ్వాలి. ఐతే కొందరు గ్రామ రెవిన్యూ అధికారులు, తాహాశిల్దార్లు ఎటువంటి పట్టా రద్దు పరచకుండా ఇతరులకు పట్టాదారు పాసుపుస్తకాలు చేశారు. ఇటువంటి భూములు చౌడేపల్లి మండలం లో సుమారు రెండు మూడు వందల ఎకరాలు కలవు. కావున ఇలా తప్పుడు పట్టాదారు పాసుపుస్తకాలు తయారు చేసిన గ్రామ రెవిన్యూ అధికారుల పైన, తాహాశిల్దార్ లో పైన, చేయించిన వారి పైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. ఐతే ఎక్కడ కూడా ఇలా సంఘటనలు జరిగిన దాఖలాలు లేవు.ఐతే ఈమధ్య ఇటువంటి భూములను గుర్తించాలని ఒక స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు తాహాశిల్దార్ కు వినతి పత్రం ఇచ్చినట్లు తెలుస్తుంది. వాళ్ళ చొరవ తోనే ప్రస్తుతం ప్రతి గ్రామ పంచాయతీ లో అసైన్మెంట్ భూములు ఆక్రమణ, పశువులు బీడులు, వనలమందలు, గుట్టలు, ప్రభుత్వ భూములను ఆక్రమణ చేయకూడదని దండోరా లు చేయుచున్నారు.

ఎబి స్విచ్‌కు గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు

-సుమారు 8 గంటలు విద్యుత్ అంతరాయం

విశాలాంధ్ర-వెదురుకుప్పం: ఎబి స్విచ్ కు గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు వేసిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని మాంబేడు పంచాయతీ ధర్మాచెరువు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మాక్రిమాకుల కండ్రిగ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు ఎబి స్విచ్ ఆఫ్ చేసి తాళాలు వేశారు. దీంతో ఆదివారం రాత్రి 11 గంటల నుండి సోమవారం 9 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. సబ్ స్టేషన్ కు అతి సమీపంలో ఇలా జరిగినా సిబ్బంది గుర్తించలేకపోవడం వారి నిర్లక్ష్యం కు అద్దం పడుతోందని విమర్శలు వచ్చిపడుతున్నాయి.అడవి పందుల వేట కోసం గుర్తు తెలిని వ్యక్తులు ఇలా చేసి ఉంటారని అధికారులు సెలవిస్తున్నారు. అయితే ఇలా గతంలో కూడా జరిగిందని తెలిసినా చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నిస్తున్నారు. ఒక గంట విద్యుత్ అంతరాయం కలిగితే మండల అధికారికి సమాచారం ఇవ్వాల్సి వున్నా 8 గంటలు గడిచినా మండల అధికారికి సమాచారం ఇవ్వకపోవడం మర్మం ఏంటో పెరుమాళ్ళ కెఱుక.ఇలా గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్ లైన్ల తో చెలగాటం ఆడుతుంటే అధికారులు పట్టించుకోకపోవడం వెనక ఆంతర్యం ఏంటని అంటున్నారు. వేటగాళ్లకు పరోక్షంగా సిబ్బంది సహకరిస్తున్నారా అనే కోణంలో దర్యాప్తు చెయ్యాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు విద్యుత్ అధికారులు చెప్పారు.

మహానాడును జయప్రదం చేద్దాం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత మాజీ ముఖ్య మంత్రి నందమూరి తారక రామారావు చేతుల మీదుగా ప్రారంభమై తెలుగు జాతికి ఐక్యంగా నిలిచిన మహానాడును జయప్రదం చేద్దామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు గాలి చలపతినాయుడు, దశరధాచారి పిలుపునిచ్చారు. సోమవారం వారు విలేకరు లతో మాట్లాడుతూ కడప జిల్లా కేంద్రానికి సమీపంలో మంగళవారం నుంచి మూడురోజుల పాటు మహానాడు జరుగుతుందన్నారు. ఈ మహానాడు కార్యక్రమానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. టీడీపీ ఆధ్వర్యంలో కడపజిల్లాలో మహానాడు నిర్వహిస్తున్న సమయంలో వైఎస్ఆర్జిల్లా పేరును వైఎస్ఆర్ కడపజిల్లాగా పేరుమారుస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వడం శుభపరిణామమన్నారు. దేశంలోనే కాకుండా తెలుగు రాష్ట్రాల్లో నెలకొన్న రాజకీయ పరిస్థితులను ఈ మహానాడు వేదికగా చర్చించి దిశానిర్దేశంచేస్తారని తెలిపారు. గత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనతో గాడి తప్పిన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై కూడా తీసుకోవాల్సిన చర్యలను మహానాడు వేదికగా తీర్మానం చేయడం జరుగుతుందన్నారు. ఈ మహానాడుకు టీడీపీ శ్రేణులు పెద్దసంఖ్యలో తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌మిన్నల రవి, టీడీపీ రాష్ట్ర బీసీ విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి ఉమేష్‌రావు, నాయకులు మునిరాజాయాదవ్, ఎంఎస్‌రెడ్డి, వజ్రం కిషోర్, కోట చంద్రశేఖర్, భీమాల భాస్కర్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయిలో మరింత బలోపేతం చేయాలి

తిరుపతి రూరల్ మండల పంచాయతీ పార్టీ అధ్యక్షులకు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సూచన

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి సంస్థాగతంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా పంచాయతీ పార్టీ అధ్యక్షులు పనిచేయాలని చంద్రగిరి నియోజక వర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్ చార్జి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి స్పష్టం చేశారు. తిరుపతి రూరల్ మండలం పరిధిలోని పంచాయతీలకు పార్టీ అధ్యక్షులుగా కొత్త గా నియమితులైన వారితో సోమవారం తుమ్మలగుం టలో సమావేశం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు మునీశ్వర్ రెడ్డి ఏర్పాటు చేసుకున్న ఈ సమావేశంకు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి హాజరై మాట్లా డుతూ ఇకపై గ్రామ పంచాయతీ అధ్యక్షులకు పార్టీ కార్యక్రమాల్లో అత్యంత ప్రాధాన్యత కలిగించేలా చూస్తామన్నారు. ప్రతి పంచాయతీలో పార్టీ కార్యక్ర మాలు జరిగేలా చూడాలని, మండలం స్థాయిలో జరిగే పెద్ద కార్యక్రమాలకు గ్రామ పంచాయతీల నుంచి అధ్యక్షులు అందరూ హాజరు కావాలన్నారు. గ్రామ స్థాయి నుంచి పార్టీ కమిటీల నియామకం మొదలు పెట్టి రాష్ట్ర కార్యవర్గం ఏర్పాటుతో ఆ ప్రక్రియను ముగించాలని పార్టీ అధినేత జగనన్న నిర్ణయించడం పార్టీ పురోభివృద్ధికి శుభ పరిణామం అన్నారు. ప్రతి పంచాయతీలో పార్టీని బలపరిచేలా కష్ట పడాలని, పార్టీ ప్రతి పక్షంలో ఉన్నపుడు అండగా నిలబడ్డ ఏ ఒక్కరికీ అధికారం వచ్చాక అన్యాయం జరగకుండా చూసే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. పంచాయతీలో ఒక కార్యకర్తకు కష్టం వస్తే మండలంలో ఉన్న పార్టీ నేతలు అందరూ ఏకం కావాలని, అక్కడ జరిగే అన్యాయాన్ని ఎదురించడానికి ఐక్యతతో గట్టిగా నిలబడాలన్నారు. అప్పుడే పోలీసులు, అధికారులు చట్టాన్ని అతిక్రమించి పని చేయడానికి ఆలోచన చేస్తారన్న విషయం అందరూ గుర్తు పెట్టుకోవాలని సూచించారు. గ్రామాలల్లో పార్టీ కార్యకర్తల మధ్య ఏదేనీ విద్వేషాలు ఉన్నట్లయితే వాటిని పూర్తిగా పక్కన పెట్టి పార్టీ బలోపేతానికి అందరూ ఏకతాటిపైకి రావాలన్నారు. అలాగే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి పార్టీ అధ్యక్షులుగా నియమితులైన వారందరికీ అభినందనలు తెలిపారు. ఈ ప్రత్యేక సమావేశంలో రాష్ట్ర పార్టీ నాయకులు ఉపేంద్ర రెడ్డి, ఎంపీపీ మూలం చంద్రమోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీ విడుదల మాదవ రెడ్డి, జడ్పీటీసీ రత్నమ్మ, పలువురు సర్పంచ్ లు, ఎంపీటీసీ లు హాజరయ్యారు.

ఇందుమూలంగా తెలియజేయడమేమనగా వెదురుకుప్పం మండలం, తిరుమలయ్య పల్లి గ్రామ పంచాయతీ, బొప్పల మడుగు గ్రామంలో శ్రీ సువర్ణ విద్యా గణపతి, శ్రీ వల్లి దేవర సుబ్రహ్మణ్యస్వామి వార్ల దేవాలయం కలదు. ఈ దేవాలయాన్ని దేవాదాయ శాఖ సందు సెక్షన్ 43 కింద రిజిస్టర్ చేయదలచినాము. ఇందుకు సంబంధించి ఏదైనా అభ్యంతరాలు ఉన్న యెడల సహాయ కమిషనర్, దేవాదాయ శాఖ, చిత్తూరు వారి కార్యాలయం నందు 15 రోజులలోపు అభ్యంతరాలు తెలియజేయగలరు.

ఇట్లు,
ఆలయ కమిటీ
బొప్పలమడుగు
తిరుమలయ్య పల్లి పంచాయతీ,
వెదురుకుప్పం మండలం, చిత్తూరు జిల్లా.

లబ్ధిదారులకు నిత్యావసరాలు సకాలంలో పంపిణీ చేయాలి

విశాలాంధ్ర-రామకుప్పం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు పరుస్తున్న నిత్యావసర సరుకుల కు సంబంధించి రేషన్ షాపుల డీలర్లు ప్రతి నెల 1వ తేదీనే లబ్దిదారులకు సక్రమంగా సకాలంలో అందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మునస్వామి పేర్కొన్నారు. సోమవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో డీలర్ల సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వాహనాల ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీ చేసేవారని అందులో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఫిర్యాదులు అందడంతో వాహనాలు తొలగించి గతంలో తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేసిన రేషన్ షాపుల ద్వారానే పంపిణీ చేయనున్నట్లు తెలిపారు లబ్దిదారులు వీలు చూసుకుని నిత్యవసర సరుకులు తీసుకునేందుకు జూన్ 1న రేషన్ షాపుల వద్ద పండుగ వాతావరణం లో నిత్యవసర సరుకులు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకట్రామే గౌడు, యూనిట్ ఇంచార్జ్ గంట్లప్ప గౌడు, రేషన్ డీలర్లు బాబు, రామకృష్ణప్ప , తదితరులు పాల్గొన్నారు.

నేత్ర పర్వంగా వేణుగోపాల వారి రథోత్సవం

విశాలాంధ్ర-కార్వేటినగరం: కార్వేటి నగరంలోని రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం వేణుగోపాలుడు రథములో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. వేకువ జామున సుప్రభాత సేవతో స్వామి వారిని మేలుకొల్పి నిత్య పూజ కైంకర్యాలను, శుద్ధి, తోమాల, అర్చన, గంట, నైవేద్యం తదితర సేవలను పూర్తి చేశారు. అనంతరం స్వామి అమ్మవార్లు తిరుచి వాహనంపై అలంకార మండపానికి వేమ్ చేశారు. ఉదయం 7 గంటల 30 నిమిషాలకు రథాన్ని అధిరోహించి పురవీధుల్లో విహరించారు. ఈ సందర్భంగా భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టారు. రాత్రి అశ్వ వాహనంపై స్వామి వారిని పుర వీధుల్లో వైభవంగా ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి కర్పూర హారతులు పట్టారు. స్వామివారి ముందు భాగాన కోలాటాలు, భజనలు ప్రదర్శన భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలోడిప్యూటీ ఈవోనాగరత్న, ఏఈఓ బి రవి, సూపర్ ఇండెంట్ మునిశేఖర్, ఆలయ ఇన్స్పెక్టర్ సురేష్ కుమార్, షరాబ్ బాబు సురేష్, కంకణ బట్టర్ తరుణ్ కుమార్, వేద పండితులు నారాయణ దాసరి, గోపాల్ ఆచారి, శబరీష్, రమేష్, ధన్వంతరి, టిటిడి సిబ్బంది భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

యోగాంధ్ర రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని పరిశీలించిన ఎంపీడీవో

విశాలాంధ్ర-పెద్దపంజాణి: చలమంగళం గ్రామపంచాయతీలో జరుగుతున్న యోగాంధ్ర రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ఎంపీడీవో బాలాజీ పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు సచివాలయ ఉద్యోగస్తులు పౌరులకు యోగాసనాల గురించి అవగాహన కలగజేసి, యోగాంధ్ర కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ చేయించాలని శిక్షణ పొందిన యోగా వాలంటీర్స్ చేత సచివాలయ స్థాయిలో పౌరులకు యోగాసనాల పైన శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, యోగ గురించి అందరికీ అవగాహన కలుగజేసేందుకు, ప్రజలలో చైతన్యం కలిగించేందుకు గ్రామస్థాయిలో యోగాసనాలకు సంబంధించి అనేక అంశాల పైన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వయం సహాయక బృందాల సభ్యులు రైతులు పౌరులు, విద్యార్థులు, ఉద్యోగస్తులు అందరూ ఈ కార్యక్రమాలలో పాల్గొనాలని తెలిపారు. అంతర్జాలం ద్వారా పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని ఎంపీడీవో బాలాజి,డిప్యూటీ ఎంపీడీవో శారదా దేవి నిర్వహించారు మండల స్థాయిలో యోగాంధ్ర నిర్వహణకై రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఎంపీడీవో చైర్మన్ గా, తాసిల్దార్ మండల విద్యాశాఖ అధికారి డిప్యూటీ ఎంపీడీవో స్టేషన్ హౌస్ అధికారి మెడికల్ ఆఫీసర్ ఏపిఎం వెలుగు అధికారులతో మండల స్థాయి యోగాంధ్ర కమిటీని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో తెలిపారు. సచివాలయ స్థాయిలో సచివాలయ స్థాయి యోగా కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కూటమి ప్రభుత్వంలోనే అన్ని రకాల దళితులు అభివృద్ధి

రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్ పర్సన్ డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి.

విశాలాంధ్ర-చిత్తూరు: రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వంతోనే దళితులు అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతున్నారని రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్ పర్సన్ డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి పేర్కొన్నారు. చిత్తూరు జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం సాయంత్రం స్థానిక ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం నందు సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి జి. చిన్నయ్య తో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఋణాలు పొంది మాదిగ మాలలు రెండు కులాలు కూడా ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధి చెందాలన్నారు. చిత్తూరు జిల్లాలో 954 యూనిట్లు,తిరుపతి జిల్లాలో 1267 యూనిట్లు, మొత్తం 2221 యూనిట్లు కు గాను రూ.92 కోట్లు కు విధులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. చిత్తూరు జిల్లాలో ఎస్ సి కార్పొరేషన్ ద్వారా 117 షాప్స్ ఉన్నాయన్నారు. 2014- 2019 సంవత్సరం మధ్యకాలంలో రాష్ట్రంలో 7 500 లక్షల కోట్లు బడ్జెట్ ప్రవేశపెడితే అందులో 40 వేల కోట్లు దళితుల అభివృద్ధికి కేటాయించడం జరిగిందని తెలిపారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 2015 - 2018 లో జిల్లాలో 242 కోట్లు తో 4 లక్షల మంది యువతకు వివిధ రకాలుగా ఉపాధి అవకాశాలు కల్పించడం జరిగిందన్నారు., సబ్ ప్లాన్ ద్వారా వివిధ రకాల అభివృద్ధి కార్యక్రమాలు జిల్లాలో చేపట్టడం జరిగిందని తెలిపారు. డ్రైవర్లుగా ఉన్న దళిత యువతను ఓనర్లు గా మార్చిన ఘనత కూడా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దక్కుతుందన్నారు. గతం లో నారా లోకేష్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఉన్న సమయంలో 4 వేల కిలోమీటర్ల సి సి రోడ్లు వేస్తే ఎక్కువ శాతం దళిత గ్రామాలలో సిసి రోడ్లు వేయడం జరిగిందని తెలిపారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరిచిన విదంగా ఎస్సీలు ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా అభివృద్ధి చెందాలని రాజ్యాంగంలో రిజర్వేషన్ కల్పించడం జరిగిందని దానికి అనుగుణంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం దళితుల అభివృద్ధికి పని చేస్తుందన్నారు. దళితులు అన్నదమ్ములుగా ఉండాలన్న ఉద్దేశంతో జనాభా ప్రాతిపదిన ఆధారంగా మాదిగలు మాలలు అభివృద్ధి చెందుటకు అవకాశం ఉంటుందన్న ఉద్దేశ్యంతో ఎస్సి విభజన జరిగిందని, విభజన తర్వాత మాదిగలు అందరూ కూడా సంతోషిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దళితుల కు అండగా ఉన్నారని, మాదిగలు, మాలలు కూటమి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు వినియోగించుకొని ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా అభివృద్ధి చెందాలన్నారు. వైసీపీ ప్రభుత్వం దళితుల అభివృద్ధికి ఎలాంటి కార్యక్రమాలు చేపట్టలేదని ఆరోపించారు. ఎస్సీ గ్రామాల్లో పర్యటించినప్పుడు గత ఐదు సంవత్సరాలలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎలాంటి రుణాలు మంజూరు కాలేదని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సి సంఘాల నాయకులు తదితరులు ఉన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లలో నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికే

శిక్షణ శిబిరాలు

కెప్టెన్ రాజగోపాల్ జగదీశ్ అత్రే

అట్టహాసంగా ప్రారంభమైన ఎన్‌సీసీ శిక్షణ తరగతులు

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ :విద్యార్థులు విద్యతో పాటు దేశ రక్షణ కోసం ఎన్ సి సి లో చేరి, శిక్షణా తరగతులలో పాల్గొని ఐకమత్యం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని క్యాంప్ కమాండెంట్ కెప్టెన్ రాజగోపాల్ జగదీష్ ఆత్రే కోరారు. సోమవారం సి.రామాపురంలోని వెరిటాస్ సైనిక పాఠశాల ఆవరణంలో వార్షిక శిక్షణ శిబిరాలను 11 ఎయిర్ స్క్వాడ్రన్ (టెక్నికల్) ఎన్‌సీసీ, తిరుపతి గ్రూప్ ప్రధాన కార్యాలయాల ఆధ్వర్యంలో ఆటహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ శిబిరంలో తిరుపతి,మదనపల్లె,బద్వేల్, చిత్తూరు జిల్లాలకు చెందిన 20విద్యాసంస్థల నుండి 509మంది ఎన్‌సీసీ క్యాడెట్లు హాజరయ్యారని క్యాంపు పరిశీలకులు గుణశేఖర్ తెలిపారు. సీనియర్ అసోసియేట్ ఎన్‌సీసీ అధికారి కేర్ టేకింగ్ ఆఫీసర్ రాజశేఖర్ ప్రధాన సమన్వయకర్తగా పనిచేస్తున్నారు. ఉదయ శిబిరంలో సహాయ ఏఎన్ఓ గా వ్యవహరిస్తున్నారు. ఈ శిక్షణ కార్యక్రమానికి 13మంది ఏఎన్ఓ లు, భారత వైమానిక దళం, సైన్యంలోని 16 మంది సిబ్బంది, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి చెందిన సివిల్ సిబ్బంది మద్దతు అందిస్తున్నారు. క్యాడెట్లలో క్రమశిక్షణ, ఐక్యత, నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేయడం ఈ శిబిరపు ప్రధాన ఉద్దేశ్యమని కేర్ టేకింగ్ ఆఫీసర్ రాజశేఖర్ తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో భాగంగా క్యాడె ట్లకు యోగా శిక్షణ,యాంటీ టొబాకో దే పాటించడం,ప్రమాదాలపైన డ్రిల్స్, పారిశుధ్యం, ఆరోగ్యంపై వర్క్‌షాప్‌లు, సైబర్ భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. శారీరక దృఢత్వాని పెంపొందించడానికి హెల్త్ రన్, వ్యాయామాలు, షూటింగ్, వ్యాస రచన, చిత్రలేఖనం, సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ అధికారి లక్ష్మీ నరసింహ, ఉపేందర్ రెడ్డి, ప్రియ,హేమలత, శిరీష,తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామం సందర్శించిన చైర్‌పర్సన్

విశాలాంధ్ర -తిరుపతి కలెక్టరేట్ : ఆంధ్ర ప్రదేశ్ శిల్పారామం చైర్‌పర్సన్ సిహెచ్.మంజుల రెడ్డి సోమవారం తిరుపతి శిల్పారామాన్ని సందర్శించారు. ఈ సందర్భనలో ఆమె నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ని కలిసి నగరిలో శిల్పారామం స్థాపనకు అభ్యర్థించారు. నగరిలో శిల్పారామం ఏర్పాటు అవసరం, ప్రాధాన్యతపై ఆమె వివరించారు. శిల్పారామం తిరుపతిని సందర్శించి, అక్కడ ఏర్పాటైన స్టాల్స్, గ్రామీణ మ్యూజియం, బోటింగ్, పచ్చదనం తదితరాలను ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, శిల్పారామం అభివృద్ధి కోసం ప్రతి ఉద్యోగి కృషి చేయాలని, అలాగే ఉద్యోగుల మధ్య విభేదాలు లేకుండా అందరూ కలిసికట్టుగా పని చేయాలని కోరారు. సమష్టిగా పనిచేసినప్పుడే శిల్పారామం అభివృద్ధి సాధ్యమవుతుందని ఆమె పేర్కొన్నారు. సందర్శకుల సంఖ్యను పెంచేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఆకర్షణీయమైన కార్యక్రమాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, క్రాఫ్ట్ ప్రోత్సాహక చర్యల ద్వారా శిల్పారామాన్ని మరింత జనాకర్షణీయంగా మార్చాలని శిల్పారామం ఏఓ సుధాకర్ కి సూచించారు. అనంతరం శిల్పారామం విజయవాడ చైర్‌పర్సన్, శిల్పారామం సిబ్బంది ఏఓ సుధాకర్ జిల్లా కలెక్టర్‌ను కలిసి, అభివృద్ధి పనుల కోసం నిధుల మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు. జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

డాలర్స్ దివాకర్ రెడ్డికి ముక్కంటి ప్రసాదాలు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ గా నియమించబడిన డాలర్స్ దివాకర్ రెడ్డికి సోమవారం టీడీపీ తిరుపతి పార్లమెంటు కార్యదర్శి, కాపుగున్నేరి సింగిల్ విండో మాజీ అధ్యక్షులు తాటిపర్తి రవీంద్రనాథరెడ్డి శ్రీకాళహస్తీశ్వరస్వామి తీర్థప్రసాదాలు అందజేశారు. అంతకు మునుపు ఆయన్ను ముక్కంటి శేష వస్త్రంతో సన్మానించి శుభాకాంక్షలు తెలియచేశారు. డాలర్స్ దివాకర్ రెడ్డి మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని తాటిపర్తి రవీంద్రనాథరెడ్డి ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.

జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిని కలిసిన జనసైనికులు

విశాలాంధ్ర-పుంగనూరు: చిత్తూరు ఉమ్మడి జిల్లా జనసేన అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్‌కు టీటీడీ ఎక్స్ బోర్డ్ మెంబర్‌గా రాష్ట్ర హస్తకళ చైర్మన్గా రాష్ట్ర ప్రభుత్వం నియమించడంతో ఆయనను మండల అధ్యక్షులు విరుపాక్షి ఆధ్వర్యంలో పుంగనూరు జనసైనికులు మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను ఘనంగా సన్మానించుకుని శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా విరుపాక్షి మాట్లాడుతూ పసుపులేటి హరిప్రసాద్ కు రానున్న రోజుల్లో మరింత ఉన్నత పదవులు రావాలని శ్రీ కలియుగ వెంకటేశ్వర స్వామిని కోరుకుంటున్నామన్నారు. అదేవిధంగా నియోజకవర్గంలో పార్టీ బలోపేతంపై ఆయనతో చర్చించడం జరిగిందన్నారు. ఆయన కూడా నియోజకవర్గంలో ఉన్న జనసైనికులు పార్టీ కోసం కష్టపడిన వారికి త్వరలోనే గుర్తింపు పదవులు రావడం జరుగుతుందని మాకు తెలియజేశారు అన్నారు ఈ కార్యక్రమంలో హరినాయక్ బాలాజీ నాయక్ నాగరాజు నాయక్ కుమార్ రేవంత్ వెంకటేష్ రమణ మురళి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మృత్యుంజయస్వామికి ప్రత్యేక పూజలు



విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం లోని మృత్యుంజయస్వామికి సోమవారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతి పూజ, కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం స్వామివారికి చందనం, నారికేళ్ళ, పసుపు, కుంకుమ, విభూధి వంటి వాటితో అభిషేకాలు చేశారు. అనంతరం సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

రేపు ముక్కంటి హుండీ ఆదాయం లెక్కింపు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం ఈ నెల 28వ తేదీ బుధవారం లెక్కించనున్నట్లు కార్యనిర్వహణాధికారి టి.బాపిరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల ఆదాయం లెక్కిస్తామన్నారు. ఆలయ ఉద్యోగులు అందరూ ఈ హుండీ లెక్కింపు కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన ఆదేశించారు.

అధికారుల డుమ్మాతో నీరుగారుతున్న ప్రజాసమస్యల పరిష్కార వేదిక

విశాలాంధ్ర-సత్యవేడు: ప్రజా సమస్యలను పరిష్కరించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు శ్రీకారం చుట్టింది. టీడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జిల్లాస్థాయిలోనూ, రెవెన్యూ, మండల స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని అధికారులు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్లో కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తుండగా, ఇదే రీతిలో రెవెన్యూ మండల స్థాయిలో నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించడం జరిగింది. ఈ క్రమంలో సత్యవేడు మండల పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్వహించాల్సి ఉంది. ఇందులో భాగంగా మండలంలోని అన్ని శాఖల అధికారులు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి తప్పకుండా హాజరు కావాల్సింది. కానీ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పలు శాఖలకు సంబంధించిన అధికారులు డుమ్మా కొట్టడంతో లక్ష్యం నీరు కారుతోంది. ఈ నేపథ్యంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ముఖ్యంగా వ్యవసాయం, ఇరిగేషన్, ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్, పోలీస్, వెలుగు, ఉపాధి హామీ,అటవీ శాఖ తదితర శాఖలకు సంబంధించిన అధికారులు గైర్హాజరు అయ్యారు. మిగిలిన శాఖ అధికారులు వచ్చిన సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక బోసిపోయింది. ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్న పలువురు అధికారులు గైర్హాజరు కావడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా జిల్లా స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రజలు పోటెత్తి వారి సమస్యలపై జిల్లా అధికారులకు వినతులు సమర్పిస్తున్నారు. అయితే ఇక్కడ మొక్కుబడిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తుండడంతో అర్జీదారులు ఎవరు కానరావడం లేదు. ఇప్పటికైనా దీనిపై జిల్లా అధికారులు స్పందించి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు తప్పకుండా హాజరయ్యేటట్టు తగు చర్యలు తీసుకోవడంతో పాటు డుమ్మా కొడుతున్న అధికారులపై శాఖపర చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మహిళలందరూ మామోగ్రామ్ చేయించుకోవాలి

బాలాయపల్లి వైద్యాధికారి డాక్టర్ లియోన

విశాలాంధ్ర-తిరుపతి: స్విమ్స్ ఆధ్వర్యంలో నిడిగల్లు, అలిమిలి గ్రామాల్లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ రొమ్ము క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించేందుకు వీలుగా 35 ఏళ్ల దాటిన మహిళలందరూ మామోగ్రామ్ పరీక్ష చేయించుకోవాలని బాలాయపల్లి వైద్యాధికారి డాక్టర్ లియోన కోరారు. తిరుపతి శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ(స్విమ్స్) ఆధ్వర్యంలో సోమవారం బాలాయపల్లి పిహెచ్ సి పరిధిలోని నిడిగల్లు, అలిమిలి గ్రామాల్లో పింక్ బస్సుల ద్వారా ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా జరుగుతోంది. బిపి, షుగర్ పరీక్షలతోపాటు పింక్ బస్సులో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ కోసం పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. మహిళలు, పురుషులు విశేషంగా విచ్చేసి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్నారు. పింక్ బస్సుల క్యాంపులు జరిగే ప్రదేశాలు..- మే 29న గొట్టికాడు, నిండలి. స్విమ్స్ డైరెక్టర్ కమ్ వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్వీ కుమార్ ఆదేశాల మేరకు కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కె.నాగరాజ్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమాల్లో స్విమ్స్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ పద్మావతి, డాక్టర్ చైతన్య భాను, సర్పంచులు సిహెచ్.గాయత్రి, దొరబాబు, పంచాయతీ కార్యదర్శులు డి.మోహన్ రాజు, చంద్రశేఖర్, స్థానిక నాయకులు మునివెంకటేశ్వర్లు, రఘురెడ్డి, సిహెచ్ఓ బి.నీరజ, సూపర్వైజర్ టివి.నరసింహారావు, ఏఎన్ఎంలు కె.రమాదేవి, ఎస్.సుహాసిని, స్థానిక వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంకమ్మ ఆలయంలో అన్నదానం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణం పీవీరోడ్డులో వెలసిన అంకమ్మ ఆలయంలో అమావాస్యను పురస్కరించుకుని సోమవారం మరాఠీపాళెం వాసులు అన్నదానం చేశారు. మూడేళ్లుగా అంకమ్మ ఆలయంలో దాతల సహాయంతో అన్నదానం చేస్తున్నట్లు ఈ సందర్భంగా వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో యశ్వంత్ రావు, జయగణేష్, హరిహరకుమార్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పులిచర్లను అన్నమయ్య జిల్లాలో కలిపే ప్రతిపాదనకు స్వస్తి చెప్పాలి

విశాలాంధ్ర -చిత్తూరు: పులిచెర్ల మండలాన్ని అన్నమయ్య జిల్లాలో కలిపే ప్రతిపాదనకు స్వస్తి చెప్పాలని పలువురు పులిచెర్ల మండల వాసులు సోమవారం చిత్తూరు కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీనియర్ టిడిపి నేత రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు రామనాథం నాయుడు ఆధ్వర్యంలో సోమవారం పలువురు పులిచెర్ల మండల వాసులు డిఆర్ఓ మోహన్ కుమార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుంగనూరు నియోజకవర్గం లోని పులిచెర్ల మండలాన్ని మినహా మిగతా మండలాలను అన్నమయ్య జిల్లాలో కలుపుతూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిందని, అయితే తాజాగా పులిచర్ల మండలం కూడా అన్నమయ్య జిల్లాలో కలుపుతూ మరో మారు నోటిఫికేషన్ ఇచ్చారని తెలిపారు. పులిచెర్ల మండలం ఇటు చిత్తూరుకు అటు తిరుపతికి సమీపంలో ఉందని, ఈ మండలాన్ని దూర ప్రాంతంలో ఉన్న అన్నమయ్య జిల్లాలో కలపడం వల్ల ప్రజలు పలు ఇబ్బందులకు లోను కావాల్సి వస్తుందని వాపోయారు. ప్రభుత్వం వాస్తవాలను గుర్తించి ఈ మండలాన్ని చిత్తూరు జిల్లా, లేక తిరుపతి జిల్లాలో కలపాలని విన్నవించారు.

30వ తేది వరకు యోగా పోటీలు

విశాలాంధ్ర-గూడూరు: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాల మేరకు, యోగాంధ్ర కార్యక్రమములో భాగంగా, గూడూరు పురపాలక సంఘ పరిధిలో వార్డు లెవెల్ యోగా పోటీలు మే 26 నుండి 30వ తేదీ వరకు సచివాలయాల పరిధిలో నిర్వహించబడతాయి. యోగా పోటీల యందు విజేతలుగా నిలిచిన వారిని తదుపరి మున్సిపల్ లెవెల్, డిస్ట్రిక్ట్ లెవెల్ మరియు స్టేట్ లెవెల్ పోటీలకు ఎంపిక చేయబడతారు. యోగా పోటీల యందు పాల్గొనదలచిన వారు, మీ దగ్గరలోని సచివాలయమునందు మీ యొక్క పేరును నమోదు చేసి, పోటీలలో పాల్గొనవలసినదిగా గూడూరు పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు.

మైనార్టీల సంక్షేమం టీడీపీతోనే సాధ్యం

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: మైనార్టీల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర మైనార్టీ కార్యనిర్వాహక కార్యదర్శిషాకీరాలీ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మైనార్టీల పథకాలు అన్ని నిర్వీర్యం అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. సాధారణ ఎన్నికల తరువాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే సీఎం చంద్రబాబునాయుడు మైనార్టీల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి కూడా నియోజకవర్గంలో మైనార్టీ అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేస్తున్నట్లు తెలిపారు. తన తండ్రి దివంగత మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి అడుగు జాడల్లో నిరంతరం అభివృద్ధి కోసం తపన పడుతుంటారన్నారు. గత వైసీపీ పాలనలో పట్టణంలోని షాదీమహళ్ళు, ఈద్గాలను పట్టించుకునే వారే కరువయ్యారన్నారు. ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన వెంటనే వాటిపై దృష్టి పెట్టి సుందరీకరణ పనులుచేయించారన్నారు. రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు అత్యంత వేడుకగా నిర్వహించుకునేందుకు ఎంతగానో కృషి చేశారని తెలిపారు. ఇక మైనార్టీ అభివృద్ధికోసం రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ రుణాలను ప్రభుత్వం విడుదల చేసిందని చెప్పారు. మరో రెండు రోజులు మాత్రమే గడువు ఉందని పట్టణ మైనార్టీలు సమీపంలోని సచివాలయాలు, మీసేవ కేంద్రాలకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించినట్లు చెప్పారు. దీనిని ముస్లిం వ్యాపారస్తులు, పేదలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. క్యాస్ట్ సర్టిఫికెట్ లేకుండా ఆన్‌లైన్లో రేషన్‌కార్డు, ఆధార్‌కార్డుతో దరఖాస్తు చేసుకోవాలని మైనార్టీ వెల్ఫేర్ అధికారులు చెప్పినట్లు తెలిపారు.

మహానాడులో తెలుగు భాషా రక్షణ గురించి తీర్మానం చేయాలి

విశాలాంధ్ర-పలమనేరు: తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమంలో తెలుగుభాషా రక్షణకు సంబంధించి తీర్మానం చేయాలని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు పి.తులసినాథం నాయుడు కోరారు. ఈ మేరకు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ను సోమవారం తిరుపతిలో కలిసి వినతి పత్రం అందించారు. తీర్మానాల కమిటీ దృష్టికి తీసుకువెళతానని ఆయన హామీ ఇచ్చారన్నారు.

యోగ పై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-పెనుమూరు: మండలంలో యోగాపై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సదస్సును ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో నీలకంఠేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం స్థానిక మండల పరిషత్ కార్యాలయం నందు పంచాయతీ కార్యదర్శులకు యోగాను గురించి అవగాహన సదస్సును నిర్వహించినట్లు తెలిపారు అంతేకాకుండా కార్యదర్శులు గ్రామాల్లోని రైతులు యోగాకు రావాలనుకున్న వారు ముందుగా పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. జూన్ రెండో తారీఖున 1000 మంది సభ్యులతో పులిగుండు వద్ద యోగా దినోత్సవం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమానికి తాసిల్దార్ శ్రవణ్ కుమార్ ఎంఈఓ భాస్కర్ నాయుడు పాల్గొన్నారు.

పలమనేరు పట్టణ డీలర్ల సంఘం అధ్యక్షులుగా నరేంద్ర

విశాలాంధ్ర-పలమనేరు: పలమనేరు పట్టణ డీలర్ల సంఘం అధ్యక్షులుగా నరేంద్ర కుమార్‌ను డీలర్స్ సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పలమనేరు తాసిల్దార్ కార్యాలయంలో సోమవారం డీలర్ల సమావేశం జరిగింది. వచ్చేనెల 1 నుంచి డీలర్ల ఆధ్వర్యంలో రేషన్ పంపిణీ పారదర్శకంగా నిర్వహించాలని తహసిల్దార్ ఇనభానాధన్ సూచించారు. అనంతరం పట్టణ డీలర్ల కార్యవర్గం ఎంపిక జరిగింది. పట్టణ డీలర్ల సంఘం అధ్యక్షులుగా ఈ.నరేంద్ర కుమార్,వైస్ ప్రెసిడెంట్ గా జిలాని భాష వైస్, జనరల్ సెక్రటరీగా జుబేర్ అహ్మద్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా మునికృష్ణయ్య, ట్రెజరర్ గా సనావుల్లా భాష, సెక్రటరీగా రాజేష్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డీలర్ల సమస్యల పరిష్కారానికి కొత్త కార్యవర్గం కృషి చేస్తుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు..

కాకాని గోవర్ధన్ రెడ్డి అరెస్టుపై వెంకటగిరి కోర్టుకు చేరుకున్న నేదురుమల్లి

విశాలాంధ్ర-వెంకటగిరి: మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి అక్రమ అరెస్టు చేసి వెంకటగిరి కోర్టులో హాజరు పరచడం ముందస్తుగా వెంకటగిరి నియోజకవర్గ వైయస్సార్సీపి సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు కోర్టు వద్దకు చేరుకొని కాకాని గోవర్ధన్ రెడ్డికి సంఘీభావం వ్యక్తపరిచారు. అనంతరం విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు.

శబ్దాల హోరు.. ప్రజలు బేజారు

- వ్యాపార ప్రకటనలు, వస్తు విక్రయదారుల ప్రచార హోరు
- శబ్ద కాలుష్యంతో బెంబేలెత్తుతున్న ప్రజలు
- గతంలో వ్యాపార ప్రకటనలకు, ప్రచారాలకు పోలీసుల అనుమతి తప్పనిసరి
- ఎటువంటి అనుమతులు లేకుండానే ప్రజలను హోరెత్తిస్తున్న వ్యాపారులు

విశాలాంధ్ర-పుత్తూరు: పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో తమ తమ వ్యాపార ప్రకటనను విస్తృత ప్రచారం కోసం, పండ్లు అమ్మే వాళ్ళ దగ్గర నుంచి శుభ్రత పరిశుభ్రత, పాత సామాన్లు కొనుట ఇలా అనేక రకాల వ్యాపారస్తులు తమ వస్తువులను అమ్ముకునేందుకు వివిధ రకాల సౌండ్ సిస్టంలను వినియోగిస్తున్నారు. పట్టణం లో ఏ వీధిలో చూసినా ఈ శబ్దాలే వినిపిస్తూ కొన్ని సందర్భాలలో ప్రజలు ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ప్రజల ఇళ్ల ఎదుట, వీధుల్లో అధిక శబ్దంతో వినిపించే ప్రకటనలు ఇప్పుడు ప్రతి రోజు తలపోటు అవుతున్నాయి. ఉదయం 6 గంటలకే ప్రారంభమయ్యే ఈ శబ్ద యంత్రాలు, పిల్లల నిద్రను భంగం చేస్తున్నాయి. వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవాళ్లు ఈ శబ్ద కాలుష్యానికి తీవ్రంగా ప్రభావితమవుతున్నారు. విద్యార్థులు చదువులపై కేంద్రీకరించలేని పరిస్థితి ఏర్పడింది. హాస్పిటల్, స్కూల్, రెసిడెన్షియల్ ఏరియాల్లోనూ లౌడ్ స్పీకర్ల వినియోగం కొనసాగుతుండటంతో, ప్రజల్లో అసహనం పెరుగుతోంది. శుభ్రతపై అవగాహన పెంపొందించాల్సిన బాధ్యతను శబ్ద బాంబులుగా మలచిన వారిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ‘క్లీనింగ్ అవసరమే కానీ, ఈ విధంగా శబ్దంతోకాదు అని పలువురు అభిప్రాయపడుతున్నారు. కొన్ని చోట్ల చిన్న చిన్న గొడవలకూ దారితీసిన ఘటనలు కూడా నమోదయ్యాయి. పాలకులు శాంతి భద్రతల్ని కాపాడాల్సింది పోయి, తమ ప్రచార పద్ధతులతో ప్రజల మానసిక ప్రశాంతతను నాశనం చేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా సౌండ్ సిస్టంల వినియోగంపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై ప్రజల్లో నిరాశ నెలకొంది. పర్యావరణ పరిరక్షణ నియమాల ప్రకారం కూడా శబ్ద పరిమితి మించకుండా ఉండాలి. కానీ అవి పట్టించుకోని పరిస్థితి ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ప్రజల ఆరోగ్యం, మనశ్శాంతికి శత్రువుగా మారిన ఈ శబ్ద ప్రచారంపై వెంటనే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ప్రతి ఒక్కరూ యోగ పై అవగాహన కలిగి ఉండాలి

ఎంపీడీవో వెంకటరత్నమ్మ

విశాలాంధ్ర-బుచ్చినాయుడు కండ్రిగ: ప్రతి ఒక్కరూ యోగా పై అవగాహన కలిగి ఉండాలి, మరియు సాధన చేయడానికి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎంపీడీవో వెంకటరత్నమ్మ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం, గ్రామ రచ్చబండ వద్ద సోమవారం యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకటరత్నమ్మ మాట్లాడుతూ నేటి సమాజంలో ఉరుకు పరుగుల జీవితంలో యోగా ఒక భాగమై పోయింది. సమాజం ఏ విధంగా మార్పు చెందుతుందో అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. 11వ యోగా దినోత్సవం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విశాఖపట్నంలో ఘన నియంగా నిర్వహిస్తున్నారు. ఆ రీతిగా మండలంలో 28 పంచాయతీ గ్రామాలలో గ్రామస్థాయిలో ప్రతిరోజు ఉదయం 6 గంటల నుండి ఏడు గంటల వరకు ప్రజలందరూ యోగా చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. వివిధ రకాల పని ఒత్తిడిని తగ్గించడంలో మరియు ఏకాగ్రతను మెరుగుపరచడంలో యోగ ప్రయోజనాలను గ్రహించాలన్నారు. జూన్ 21వ తేదీ నాటికి ప్రతి ఒక్కరు యోగ పై రిజిస్ట్రేషన్ చేసుకుని అధికారులు సర్వే చేసి యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తొన్నాటి సుబ్రహ్మణ్యం. ఉపసర్పంచ్ కె ఎం రాజా, వెలుగు సమైక్య ఏపిఎం మునెయ్య ,అధికారులు, పొదుపు మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సత్కరించిన రేషన్ డీలర్లు

విశాలాంధ్ర-గూడూరు: రేషన్ దుకాణాల ద్వారా పేదలకు బియ్యం,ఇతర వస్తువులు పంపిణీ చేయాలని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ సూచించారు.జూన్ ఒకటో తేదీ నుండి డీలర్ల ద్వారానే బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలివ్వడంతో డీలర్లు..గూడూరు లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి ఘనంగా సన్మానించారు.అనంతరం ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ.. వైకాపా హయాంలో వాహనాల ద్వారా అందరికి బియ్యం పంపిణీ చేయలేక పోయారని, రోడ్లల్లో గుంపులు గుంపులుగా బండ్ల వద్ద ప్రజలు అవస్థలు పడుతూ బియ్యం తీసుకునే వారన్నారు. కూటమి ప్రభుత్వంలో మళ్ళీ డీలర్ల ద్వారానే బియ్యం పంపిణీ కి చర్యలు తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సైదాపురం మైనింగ్ కేసులో మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డికి 14 రోజులు రిమాండ్

విశాలాంధ్ర-వెంకటగిరి: సైదాపురంలో వాచ్ అక్రమ మైనింగ్ కేసులో నిందితుడిగా ఆరోపిస్తున్న మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి కి వెంకటగిరి మున్సిఫ్ కోర్ట్ న్యాయాధిపతి వర్మ.. 14 రోజుల రిమాండ్‌ను విధిస్తూ నెల్లూరు జైలుకు తరలించాలని ఆదేశించారు. దాదాపుగా రెండున్నర గంట విచారణ అనంతరం న్యాయాధిపతి రిమాండ్ విధించారు.

ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ప్రతిపాదనలు ఆపాలి

ఏఐటియుసి, సిఐటీయూ నేతలు డిమాండ్

విశాలాంధ్ర-చిత్తూరు: విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ ప్రతిపాదనలు మానుకోవాలని, తొలగించిన కార్మికులను పనిలోకి తీసుకోవాలని కార్మిక సంఘాల రాష్ట్ర వ్యాప్త పిలుపుమేరకు సోమవారం చిత్తూరు కలెక్టరేట్ వద్ద ఏఐటియుసి, సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి డిఆర్ఓకి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు వాడ గంగరాజు, ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్.నాగరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేసే ప్రక్రియ వేగవంతం చేశారని దాని వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత కూటమి పార్టీలు గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మేము అధికారంలోకి వస్తే విశాఖ ఉక్కు ను ప్రభుత్వ ఆధీనంలో నడుపుతామని హామీ ఇచ్చినప్పటికీ అధికారంలోకి వచ్చిన తర్వాత దాని ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. ఎన్నో ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న విశాఖ ఉక్కును కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. మైనింగ్ కేటాయిస్తే అత్యధిక లాభాలు నడిచే విశాఖ ఉక్కును ఎందుకు ప్రైవేటీకరణ చేయడానికి పూనుకుంటున్నారని ప్రశ్నించారు. కార్పొరేట్లకు కట్టబెట్టడానికి కారు చౌకగా వేలాది ఎకరాలను అప్పగించ ప్రయత్నం చేస్తున్నారు. లక్షలాదిమంది ఆధారపడే విశాఖ ఉక్కు ను ప్రభుత్వ ఆధీనంలోనే నిర్వహించాలని, తొలగించిన కార్మికులందరినీ పనిలోకి తీసుకోవాలని, మెడికల్ చెకప్‌లు వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. తెలుగుదేశం, జనసేన పార్టీలు గతంలో ఇచ్చిన హామీ ప్రకారం విశాఖ ఉక్కును కాపాడే పద్ధతులతో చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ప్రజలు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

కోవిడ్ నిబంధనలపై ప్రజలలో అవగాహన కల్పించాలి

మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చందన ప్రియ

విశాలాంధ్ర-పలమనేరు: యూపీఎస్సీ కాకా తోపు నందు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చందన ప్రియ ఆధ్వర్యంలో పేరా మెడికల్ సిబ్బందికి సోమవారం సమావేశ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పలమనేరు మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి పౌరునికి కోవిడ్ 19 నిబంధనలను పాటించు విధముగా ప్రజలలో అవగాహన కల్పించాలనన్నారు. తప్పనిసరిగా మాస్కులు రైల్వే స్టేషన్లు బస్ స్టేషన్లు రద్దీ ఎక్కువగా ఉన్న ప్రదేశాలలో తప్పక భౌతిక దూరము పాటించాలని అలాగే జ్వరము జలుబు బాడీ పెయింట్స్ మొదలైన లక్షణాలతో ఉన్న వారు తప్పక వైద్యుని సంప్రదించి వైద్య సలహాలను పాటించాలన్నారు. కోవిడ్ ఇప్పటికీ అంత ప్రమాదం కాదు కానీ జాగ్రత్తలు మాత్రము తప్పక తీసుకోవాలని ప్రజలలో అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే మంత్ర డివైసర్ బయోమెట్రిక్ డివైసర్ని ప్రతి ఆరోగ్య కార్యకర్తకు పంపిణీ చేశారు. ఎన్సిడిసిడి సర్వేలో వీటిని ఉపయోగించి ఆధార్ లింక్డ్ సమాచారాన్ని పొంది ఎన్ సి డి సర్వే పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా ప్రజలలో ఆరోగ్య కార్యక్రమాలపై విస్తృతముగా ప్రచారం చేయాలని జూన్ 1వ తేదీ నుండి జూన్ 30వ తేదీ వరకు మలేరియా మాస ఉత్సవాలు సందర్భముగా ప్రతి ఒక్కరూ దోమ కాటు నుండి రక్షణ పొందు విధముగా దోమ లార్వాలను నియంత్రించు విధముగా ప్రజలలో అవగాహన కల్పించాలని సిబ్బందికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సభ్ యూనిట్ అధికారి జయశంకర్ వైద్య సిబ్బంది ఉషా కుమారి అముదా సుభాషిని పార్వతి అనిలా ఆశాలు మంజుల రాజేశ్వరి ప్యారి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగాపై అవగాహన

విశాలాంధ్ర-పుత్తూరు: పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుత్తూరులో యోగా విద్యపై అవగాహన సదస్సు జరిగింది, రాబోయే జూన్ నెల 21వ తేదీని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుకుంటారు, ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రపంచ రికార్డును నెలకొల్పే దిశలో యోగా కార్యక్రమాలను జరపడానికి నిశ్చయించారు. ఈ సందర్భంగా యోగాంధ్రా కార్యక్రమాన్ని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ప్రారంభించింది. ఈ సందర్భంలో సోమవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల పుత్తూరులో జరిగిన యోగా అవగాహన సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. చంద్రమౌళి మాట్లాడుతూ భారతీయ ప్రాచీన సాంప్రదాయాలలో యోగ ఒకటి అని,యోగా వల్ల శారీరక, మానసిక ఆరోగ్యాలు మెరుగుపడతాయని అన్నారు. శారీరక మానసిక శక్తుల ఐక్యతే యోగ అని, యోగ వల్ల ఆధ్యాత్మిక వికాసం, జీవన నైపుణ్యాలు అలవాడతాయని ఇతర వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టి.నరసింహులు, డాక్టర్ డాక్టర్ టి.రఘురామన్, టి.కిషోర్ బాబు, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

అవమానించబడిన చోటే సన్మానం

విశాలాంధ్ర-పుంగనూరు: రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడును గత వైసిపి ప్రభుత్వం లో అక్రమ అరెస్టు చేసి జైల్లో పెట్టినప్పుడు శ్రీకాకుళం కు చెందిన ఐదుగురు టిడిపి శ్రేణులు శ్రీకాకుళం నుండి కుప్పం వరకు సైకిల్ యాత్ర చేపట్టడం జరిగింది. అందులో భాగంగా పుంగునూరు మండలం సుగాలిమిట్ట సమీపాన వారు అప్పుడు సైకిల్ యాత్ర చేరుకోగా అప్పటి వైసిపికి చెందిన చెంగలాపురం సూరి తన మిత్రులతో కలిసి ఐదుగురును దుర్భాసలాడుతూ వారి బట్టలు తీయించి అవమానపరచడం జరిగింది ఇప్పుడు టిడిపి అధికారంలో ఉండడంతో ఐదుగురికి ఎక్కడైతే అవమానం జరిగిందో అక్కడ వారిని గౌరవించుకోవాలనే ఉద్దేశంతో టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి నేతృత్వంలో వారి సైకిళ్లకు పాలాభిషేకం చేసి వారిని ఘనంగా సన్మానించి గౌరవ వందనం చేయడం జరిగింది. ఈ సందర్భంగా టిడిపి ఇన్చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఆనాడు టిడిపి శ్రేణులు అవమాన పరచిన వ్యక్తి పరారీలో ఉన్న చెంగలాపురం సూరిని త్వరలోనే అరెస్ట్ చేసి అదుపులోకి తీసుకుని రిమాండ్ కు పంపి కఠినంగా శిక్షించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి శ్రేణులు మండల పార్టీ అధ్యక్షులు మాధవరెడ్డి పివి రెడ్డి శ్రీకాంత్ చదల వెంకట్ రెడ్డి మోహన్ రెడ్డి పోలీస్ గిరి సమీపతి యాదవ్ రమణ గంగాధర్ రాఘవ హరి ప్రసాద్ చంద్రశేఖర్ కుమార్ కృష్ణా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఆధార్ నమోదు

విశాలాంధ్ర-బుచ్చినాయుడు కండ్రిగ: రాష్ట్రవ్యాప్తంగా 0-6 ఏళ్ల వయస్సు గల చిన్నారులకు ఆధార్ నమోదు చేసేందుకు ప్రత్యేక ఆధార్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందని ఎంపీడీవో వెంకటరత్నమ్మ తెలిపారు. మండల కేంద్రంలోని సచివాలయం పరిధిలో సోమవారం ప్రత్యేక ఆధార్ నమోదు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. చిన్నారులకు ఆధార్ నమోదుతో పాటు అప్డేట్ కూడా చేయించుకునేందుకు అవకాశం కల్పించింది. దీంతో 28 పంచాయతీలో ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో నమోదైన ఆరేళ్ల లోపు పిల్లలతో ఆధార కేంద్రం వద్ద పెద్ద సంఖ్యలో హాజరయ్యారు, ప్రిమిటివ్ ట్రైబల్ గ్రూపు(పీవీటీజీ)లకు ఆధార్ నమోదు ప్రక్రియ చేపట్టేందుకు ప్రత్యేక ఆధార్ క్యాంపులను ఏర్పాటు చేయడంతో గిరిజనులు చిన్న పిల్లలతో ఆధార్ క్యాంపులో పాల్గొన్నారు. ఆధార్ క్యాంప్ కార్యాలయాన్ని ఎంపీడీవో పర్యవేక్షించారు.

అక్రమ కేసుల వ్యవహారంలో

టిడిపి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు

విశాలాంధ్ర-వెంకటగిరి: ప్రజల కొరకు ప్రజాసేవ కొరకు పోరాడే వ్యక్తులపై తప్పుడు కేసులు పెట్టడం రెడ్ బుక్ పాలనకు పరాకాష్ట అని వెంకటగిరి వైయస్ఆర్సీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి తెలిపారు సోమవారం వెంకటగిరి లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు కూటమి ప్రభుత్వ యొక్క తప్పుడు నిర్ణయాలను అనుక్షణం గమనిస్తూ ఉన్నారని వీరికి త్వరలోనే బుద్ధి చెప్పడం ఖాయమని తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపిస్తే పార్టీ నష్టపోతుందని ఆలోచనతోనే ఇటువంటి దుర్మార్గమైన చర్యలకు పాల్పడుతున్నారని నిరంతరం ప్రజలతోనే మమేకమై ఉండే మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి పై సైదాపురం మైనింగ్ కేసులు పెట్టడం అంతేకాకుండా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు ఇతర కేసులు లో కూడా మాజీ మంత్రి కాకాని అరెస్టు రెడ్ బుక్ పాలనకు పరాకాష్ట అక్రమ అరెస్టులకు కేసులకు భయపడేది లేదు వైయస్సార్సీపి ఎప్పుడూ ప్రజాపక్షానే పోరాటాలకు సిద్ధం ఇల్లీగల్ గా మైనింగ్ చేశానని తప్పుడు కేసులు మన ఇంటి ఏ వన్ ముద్దాయికి బెయిల్ వచ్చిందని కాకానిని ఈ కేసులో ? ఎక్కించారని ఇల్లీగల్ మైనింగ్ పై గత వారంలో జిల్లా ఎస్పీకి కేంద్ర మైనింగ్ సెక్రటరీకి ఫోటోలు వీడియోలతో సహా ఎవరు చేస్తున్నారు ఆధారాలతో ఇచ్చామని వారిని వదిలేసి వీరిపై తప్పుడు కేసులు పెట్టడం ఎంతవరకు న్యాయమని విమర్శించారు.

డీలర్లు సమయపాలన పాటించండి: తాసిల్దార్

విశాలాంధ్ర-పెద్దపంజాణి: మండలంలోని అన్ని ప్రభుత్వ చౌకధరల దుకాణాల ద్వారా అర్హులైన పేదలకు అందించే రేషన్ బియ్యం పంపిణీలో డీలర్లు సమయపాలన పాటించాలని మండల తహసిల్దార్ సి ఎస్ అనిల్ కుమార్ రేషన్ డీలర్లను ఆదేశించారు. సోమవారం మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో మండలంలో డీలర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చౌకధరల దుకాణాల ద్వారా అర్హులైన పేదలకు అందించే రేషన్ బియ్యం పంపిణీలో డీలర్లు సమయపాలన పాటించాలని అన్నారు. పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం చౌక ధరల దుకాణాల ద్వారా రేషన్ బియ్యం అందిస్తోందని,డీలర్లు ప్రభుత్వం నిర్దేశించిన సమయాల్లో రేషన్ షాపు తెరిచి ఉంచి పంపిణీ చేయాలని అన్నారు. ప్రతీ నెల 1వ తేదీ 15వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు,సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేయాలని,అలాగే దుకాణాల్లో రేషన్డీలర్ పేరు, మొబైల్ నెంబర్,స్టాక్ పంపిణీ వివరాలతో బోర్డులు నిర్వహించాలని,చౌకధరల దుకాణం చిరునామా తెలిసేలా బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. డిజిబిలిటీ వృద్ధులు వికలాంగులకు వారి ఇంటి వద్దనే నిత్యవసర వస్తువులను ఇవ్వాలన్నారు. లబ్ధిదారులకు ఇబ్బందులు తలెత్తకుండా బియ్యం పంపిణీ ప్రక్రియ చేపట్టాలని డిప్యూటీ తహసిల్దార్ యుగేష్ రెడ్డి తెలిపారు. మొదటగా వారి షాపులోని కార్డుదారులకు పంపిణీ చేసి తర్వాత పోర్టబిలిటీ కార్డులకు వేయాలని రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాకేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

మహానాడుకు తరలిరండి

విశాలాంధ్ర-పలమనేరు: కడపలో ఈ నెల 27, 28, 29 తేదీలలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో జరగనున్న మహానాడు కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావాలని ఆ పార్టీ పలమనేరు పట్టణ అధ్యక్షులు ఆర్బిసి కుట్టీ పిలుపునిచ్చారు. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం మహానాడు కార్యక్రమ సన్నద్ధం పై ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చరిత్రలో నిలిచిపోయేలా కడపలో మహానాడును నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. పార్టీ ఆవిర్భా వం తరువాత మొదటగా కడప వేదికగా జరిగే ఈ మహానాడుకు ఓ ప్రత్యేకత ఉందన్నారు. టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న మహానాడుకు సుమారు 5 లక్షల మంది రానున్నరన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహానాడును ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించడం తెలుగు దేశం పార్టీకి, పార్టీ శ్రేణులకు గర్వకారణంగా నిలుస్తోందని అయితే ఈ మహానాడును కనివిని ఎరుగని విధంగా నిర్వహించాలని నిర్ణయిం చడమైందన్నారు. మహానాడును జయప్రదం చేయడమే మనందరి లక్ష్యమని కాబట్టి ప్రతి ఒక్కరు ఈ మహానాడు పండుగకు విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పలమనేరు ఆపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్వి బాలాజీ, నాయకులు బ్రహ్మయ్య, ఖాజాపిర్, నాగరాజు, చాంద్ బాషా, కృష్ణమూర్తి, మదన్, బీఆర్సి కుమార్, మాబాషా, సురేష్, భాస్కర్ యాదవ్ తదితరులున్నారు.

ఐదు రోజులపాటు యోగా శిక్షణ

విశాలాంధ్ర-పాకాల: పాకాల మండలంలో పనిచేస్తున్న ప్రభుత్వ సిబ్బందికి ఐదు రోజులపాటు యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అరుణ తెలిపారు. యోగా ఆంధ్ర అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 27వ తేదీ నుండి 31వ తేదీ వరకు పాకాల మండలంలో పనిచేస్తున్న 171 మంది సచివాలయ, వెలుగు, మండల సిబ్బందికి పాకాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, దామలచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 27వ తేదీ నుండి 31వ తేదీ వరకు ఐదు రోజులపాటు ప్రతిరోజు ఉదయం 7 గంటల నుండి 8 గంటల వరకు యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో తెలియజేశారు.

గుజిరి వ్యాపారస్తుల తిరుపతి మహాసభ కరపత్రాల విడుదల

విశాలాంధ్ర - తిరుపతి : స్థానిక భైరాగీ ట్టిడలోని ఏఐటియుసి కార్యాలయంలోగుజిరి వ్యాపారస్తుల కరపత్రాలు విడుదల చేయడం జరిగింది ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ మాట్లాడుతూ తిరుపతి నగరంలో నిత్యం వేలాది భక్తులతో కిటకిటలాడుతూ ఉంటుంది స్థానికులు భక్తులు వాడి వదిలేసిన ప్లాస్టిక్ బాటిల్ మరియు ఇతర వ్యర్థాలు సేకరించి అదే తమ బతుకు జీవంగా పనిచేస్తున్న గుజిరి వ్యాపారస్తుల పై పోలీసులు మరియు మున్సిపాలిటీ సిబ్బంది వేధింపులకు గురవుతున్నారు లైసెన్స్ ఇస్తామని డబ్బులు కట్టించుకోనీ లైసెన్స్ మాత్రం ఇవ్వడం లేదునీ ఆరోపించారు గుజిరి వ్యాపారస్తులు అన్ని రకాల పనికిరాని వస్తువులు ప్లాస్టిక్ మెటీరియల్ పేపర్లు అట్టలు ఇతర ఇనుము రాగిలాంటి అనేక వస్తువులు వీధుల్లో పడేయకుండా స్క్రాప్ ను పోగు చేసి దాన్ని మరలా రీ సైకిల్ చేయడం సమాజానికి తిరిగి ఉపయోగపడేలాగా మార్పు చేస్తున్నారు అలాంటి వారి మీద దొంగతనాలు మోపుతూ సమాజంలో నేరస్తులకు చూపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో గుజిరి వ్యాపారుల సంఘం తిరుపతి జిల్లా మొదటి మహాసభ జూన్ 20 తేదీన తిరుపతి నగరంలో ఘనంగా జరుగుతోందని మహాసభలో వ్యాపారస్తులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి సమస్య పరిష్కారం కోసం ఐక్యంగా ఉండాలని పోరాడాలని తెలిపారు. కావున గుజిరి వ్యాపారస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ మహాసభ జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నగర అధ్యక్ష కార్యదర్శులు రాజా, రవి పద్మనాభ రెడ్డి, గోవిందా స్వామి, రామకృష్ణ, గుజిరి వ్యాపారస్తుల సంఘం నగర అధ్యక్షులు దాము నగర కార్యదర్శి అల్లాబక్షు ఉపాధ్యక్షులు రాము సహాయ సలహాదారులు బాలన్ కార్యదర్శి అలీబాషా శ్రీరాములు కోశాధికారి అజీమ్ రాదాలత మురళి షుకూర్ తదితరులు పాల్గొన్నారు.

అలస్యంగా జరిగిన ఏపీ ఈఏపీసెట్ పరీక్షలు టెన్షన్ పడిన విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళన

విశాలాంధ్ర-పుత్తూరు: రాష్ట్రంలో ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేసిన పేద మధ్య తరగతి విద్యార్థులు ఇంజినీరింగ్, ఆగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ఉచిత ప్రవేశాల కోసం ఏపీ ఈఏపీసెట్ పరీక్ష వారికున్న ఏకైక మార్గం. దీనిని సమర్థవంతంగా నిర్వహించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అయితే సోమవారం 9 గంటలకు ప్రారంభం కావల్సిన పరీక్ష సర్వర్లో సాంకేతిక లోపం అంటూ విద్యార్థులను కళాశాల బయటే నిలిపివేసిన ఘటన పుత్తూరులోని శ్రీవెంటక పెరుమాళ్ ఇంజినీరింగ్ కళాశాల వద్ద చోటు చేసుకొంది. అలాగే నారాయణవనంలోని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల, తిరుపతిలోని చదలవాడ కళాశాలల వద్ద పరీక్షలు ఆసల్యంగా ప్రారంభమయ్యాయి. చోటు చేసుకొంది. దీంతో పరీక్ష రాయడానికి వచ్చిన విద్యార్థులు, వారితో వచ్చిన తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఆన్లైన్ పరీక్షలు నిర్వహిస్తున్నప్పుడు ముందస్తు జాగ్రత్తలు ఎందుకు తీసుకోరంటూ తల్లిదండ్రులు ప్రశ్నించారు. ఇది కేవలం ప్రభుత్వ వైఫల్యమే అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం పరీక్ష ఆలస్యంతో మద్యాహ్నం 2 గంటలకు ప్రారంభం కావల్సిన పరీక్ష 3 గంటలకు ప్రారంభమైంది. రెండవ దఫా విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు.

గూడూరు - గిద్దలూరు రోడ్డును మరమ్మతులు చేపట్టండి :కాంగ్రెస్ నేత పంటా శ్రీనివాసుల రెడ్డి

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు - గిద్దలూరు రోడ్డు మార్గానికి మరమ్మత్తులు చేయండని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంటా శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు.సోమవారం తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజా విజ్ఞప్తుల దినంలో వినతి పత్రా న్ని అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ గత కాంగ్రెస్ ప్రభుత్వ హాయాంలో 2014వ సంవత్సరం ముందు వేసిన రోడ్డును మరమ్మతు పనులు చేయకుండా ఇప్పటి వరకు ఆ ప్రాంతంలో ఉన్న 15 గ్రామా లు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారన్నారు. ప్రతి రోజు దాదాపు 7000 మందికి పైగా ఈ రోడ్డులో రాకపోకలు సాగిస్తుంటారు. విద్యార్థులు, ఉద్యోగులు, కర్షకులు, కార్మికులు, రైతులు రాకపోకలు సాగించలేక నానావస్థలు పడుతున్నారన్నారు. ఎంతోమంది ఈ రహదారిలో ప్రయాణించడం వలన నడుము విరిగి, కాళ్ళు చేతులు విరిగి ఆసుపత్రుల పాలైనారు. నిండు గర్భిణులు సైతం చాలా మంది ఇబ్బందిన పడిన పరిస్థితి, మనం ప్రజలకు మేలు చేసే విధంగా రోడ్డు, రవాణా సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వా నిదని మరచినట్లున్నారాని ఎద్దేవా చేశారు. వాహనం కొనేటప్పుడు అన్ని టాక్సు కట్టించుకుంటూ ప్రభుత్వమే ప్రజలకు రోడ్డు వసతి కల్పించలేకపోవడం దుర్మార్గం అని తెలిపారు.. తేది05.05.2025న గూడూరు సబ్-కలెక్టర్ కి , ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు (ర.భ.) వారికి అర్జీ సమర్పించి రోడ్డు బాగుచేయాలని కోరగా వారు 4 కోట్ల 50 లక్షల రూపాయలతో రోడ్డు మరమ్మత్తు పనులు చేసినట్లుగా మాకు చెప్పడం జరిగిందన్నారు. రోడ్డుకు సంబంధించి గత 10 సం॥లు పైగా ఇప్పటి వరకు మరమ్మత్తు పనులు చేపట్టిన దాఖలాలు లేవు. గత పదేళ్లు పైగా మరమ్మత్తు పనులు చేపట్టకపోవడానికి అధికారుల నిర్లక్ష వైఖరే కారణమని భావించాల్సి ఉందన్నారు.. గత వై.సి.పి. ప్రభుత్వం నేడు తెలుగుదేశం ప్రభుత్వం రెండు మీ రోడ్డును బాగుచేస్తామని చెప్పి ఓట్లు దండుకోవడం తప్ప ఎటువంటి మరమ్మత్తులు పనులు చేయకపోగా, డబుల్ రోడ్డు మంజూరు అయినదని చెప్పి కాలయాపన చేస్తున్నారన్నారు. దీనిపై వెంటనే చర్యలు చేపట్టి వెంటనే సదరు రోడ్డుకు మరమ్మత్తులు చేయాలని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి దంపతుల మానవత్వం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి, ఆయన సతీమణి బొజ్జల రిషితారెడ్డి మానవత్వం చాటుకున్నారు. చావు బతుకుల మధ్య రేఖపై ఉన్న ఓ చిన్నారికి వైద్య సదుపాయం అందించడానికి వారు ముందుకు వచ్చారు. ఎమ్మెల్యే దంపతుల హామీతో ఆ నిరుపేద దంపతుల ఆనందానికి అవధులు లేకుండా పోతున్నాయి. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాళహస్తి పురపాలక సంఘం పరిధిలోని 24వ వార్డు పురంవారివీధికి చెందిన ఎన్.సాయికిరణ్, మోహన్ దంపతులది చాలా నిరుపేద కుటుంబం. ఈ దంపతులకు ఎన్. సాద్విక్ అనే అనే ఐదు నెలల బాలుడు ఉన్నాడు. ఈ బాలుడు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. సాద్విక్ కు వెంటనే కిడ్నీ మార్పు చేయకపోతే ప్రాణాల మీదకు వస్తుంది. ఇందుకు రూ.20లక్షలకు పైగా ఖర్చు అవుతుంది. ఇంత సొమ్ము ఖర్చు చేసే స్థోమత వారికి లేదు. తమ బిడ్డ ప్రాణాలు కాపాడటానికి సాయం చేయాలని ఆ నిరుపేద దంపతులు పలువురిని వేడుకుంటూ వచ్చారు. మంచి మనసున్న ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి దృష్టికి ఈ సమస్య తీసుకుపోవాలని సాయికిరణ్, మోహన దంపతులకు వారి శ్రేయోభిలాషులు సలహా ఇచ్చారు. దీంతో సాయికిరణ్, మోహన దంపతులు తన కుమారుడు సాద్విక్ ను తీసుకుని ఊరందూరుకు వెళ్లి ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి, ఆయన సతీమణి బొజ్జల రిషితారెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వారి గోడును వెళ్ల బోసుకున్నారు. సాద్విక్ పరిస్థితిని చూసి బొజ్జల వెంకటసుదీర్ రెడ్డి, బొజ్జల రిషితారెడ్డి చలించి పోయారు. వెంటనే చెన్నైలోని వేలా మెడికల్ ఇన్ స్టిట్యూట్‌కు ఫోన్ చేశారు. సాద్విక్ వైద్య ఖర్చులు తాము భరిస్తామని... ఆ బాలునికి మెరు గైన వైద్య సేవలు అందిం చాలని ఆస్పత్రి నిర్వాహ కులకు విజ్ఞప్తి చేశారు. ఇందుకు వారు సానుకూలంగా స్పందించారు. ఎమ్మెల్యే సూచనల మేరకు సాద్విక్‌ను ఆ బాలుని తల్లి దండ్రులు చెన్నైలోని వేలా మెడికల్ ఇన్ స్టిట్యూట్ కు తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నారు. కాగా తమ బిడ్డ వైద్య ఖర్చులకు సాయం చేయదలచిన వారు 9985581189 ఫోన్ నంబరుకు సంప్రదిం చాలని సాయికిరణ్, మోహన దంపతులు వేడుకుంటున్నారు.

కార్డియో పల్మనరీ రిససిటేషన్" బేసిక్ ఫస్ట్ ఎయిడ్ స్కిల్స్ శిక్షణ : ప్రాంతీయ రవాణా శాఖాధికారి మురళి మోహన్

విశాలాంధ్ర - తిరుపతి : ప్రపంచ అత్యవసర వైద్య దినోత్సవం - మే 27, 2025 సందర్భంగా మంగళంలోని ప్రాంతీయ రవాణా శాఖాధికారి కార్యాలయం (ఆర్టిఓ) సహకారంతో " కార్డియో పల్మనరీ రిససిటేషన్" బేసిక్ ఫస్ట్ ఎయిడ్ స్కిల్స్ శిక్షణా కార్యక్రమాన్ని అమర్ ఆసుపత్రి తిరుపతి వారు ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక ప్రాంతీయ రవాణా శాఖా ధికారి తిరుపతి కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నారు. అత్యవసర సమయంలో ప్రాణాలు నిలబెట్టే ప్రక్రియ పట్ల ప్రజలకు అవగాహన పెంచడం మరియు ప్రాణాలను పరిరక్షించే అత్యవసర ప్రతిస్పందన నైపుణ్యాలను ప్రోత్సహించడం ఈ శిక్షణా శిబిరం యొక్క లక్ష్యంగా జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ తెలియజేశారు. వరల్డ్ ఎమర్జెన్సీ మెడిసిన్ డే 2025 థీమ్ "మీ అత్యవసర సంరక్షణను అందించడానికి గర్వంగా ఉంది", ఇది ప్రపంచవ్యాప్తంగా అత్యవసర సంరక్షణ ప్రదాతలు అందించే అచంచల అంకితభావం మరియు క్లిష్టమైన సేవలను గౌరవిస్తుంది మరియు ప్రభావితం చేస్తుంది. ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ ప్రసాద్ గౌరినేని, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమాదేవి గౌరినేని, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ శ్రీమతి భాగ్యలక్ష్మి, అమర ఆసుపత్రి అత్యవసర విభాగాధిపతి డాక్టర్ శివరామ కృష్ణారెడ్డి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అమర ట్రామా సిస్టమ్ (ఎటిఎస్) సేవల ద్వారా వ్యక్తులకు ముఖ్యమైన అత్యవసర ప్రతిస్పందన పరిజ్ఞానంతో సాధికారత కల్పించడం వారి సమిష్టి దార్శనికత. ఈ కార్యక్రమ శిక్షణకు ముఖ్యంగా వాహనదారులు హాజరుకావాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఇటువంటి ప్రభావవంతమైన కార్యక్రమాల ద్వారా ప్రజారోగ్య విద్య మరియు అత్యవసర ప్రాణ సంరక్షణకు సరియైన తర్ఫీదు పొందగలరు.

ఎనర్జీ డ్రింక్ మిక్స్‌కు అనుష్క శర్మతో క్యాంపెయిన్

విశాలాంధ్ర- తిరుపతి : శక్తి, రోగనిరోధక శక్తి, హైడ్రేషన్‌కు మద్దతుగా విటమిన్లు, ఖనిజాలతో కూడిన రుచికరమైన ఎఫెర్‌వెసెంట్ ఎనర్జీ డ్రింక్ మిక్స్ సెంట్రమ్ రీఛార్జ్ విడుదలకు బాలీవుడ్ నటి బ్రాండ్ అంబాసిడర్ అనుష్క శర్మతో సమగ్ర మల్టీమీడియా క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి అతిష్ నేగి తెలిపారు. సమగ్ర మల్టీవిటమిన్ మద్దతులో ప్రజాదరణ పొందిన సెంట్రమ్, నేడు పోటీతో కూడిన ఎనర్జీ డ్రింక్ మిక్స్ విభాగంలోకి సెంట్రమ్ రీఛార్జ్ విడుదలతో, దాని ఉత్పత్తి శ్రేణిని విస్తరించించామని తెలిపారు. ఈ వినూత్న ఉత్పత్తిని వినియోగదారులు రోజువారీ కార్యకలాపాల సమయంలో కోల్పోయిన, శరీరానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలను తిరిగి భర్తీ చేసేందుకు వీలుగా తయారు చేశారు. ఇది శక్తిని, రోగనిరోధక శక్తిని, శరీరానికి కావలసిన నీటిని అందించేందుకు తోడ్పడుతుందన్నారు. చాలా మంది ఎలక్ట్రోలైట్ నష్టం గురించి మాట్లాడుతుంటారు. దీంతో మనం అలసిపోతాము. దీన్ని ఘనంగా విడుదల చేసేం దుకు, బాలీవుడ్ నటి, బ్రాండ్ అంబాసిడర్ అనుష్క శర్మతో కలిసి సమగ్ర మల్టీమీడియా క్యాంపెయిన్‌ను సెంట్రమ్ అభివృద్ధి చేసిందని వెల్లడించారు.

కార్పొరేషన్ రుణాలు చేతికందేదెప్పుడో...!

విశాలాంధ్ర-వి.కోట: రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్పొరేషన్ ల ద్వారా చదువుకున్న యువతీ యువకులకు స్వయం ఉపాధితో జీవనోపాధి కల్పించేందుకు రాయితీలతో కూడిన రుణాలు మంజూరు చేసేందుకు ఇటీవల ఇటీవల ఆన్లైన్ లో దరఖాస్తులు స్వీకరించారు. అందులో భాగంగా బిసి కార్పొరేషన్ ద్వారా రెడ్డి, కాపు, కమ్మ, బ్రాహ్మణ, కుమ్మరి, బిసి, ఈ బిసిలకు రుణాలు అందించేందుకు మండలంలో ఏడు బ్యాంకుల నుంచి 101 రుణాలకు టార్గెట్ ఇచ్చారు. కాగా ఫిబ్రవరి నెలలో ముగిసిన దరఖాస్తుల స్వీకరణ నాటికి మండలంలో మొత్తం 273 మంది అభ్యర్థులు రుణాలకు దరఖాస్తులు చేసుకున్నారు. వాటిలో 6 దరఖాస్తులు తిరస్కరణకు గురికాగా 19 దరఖాస్తులు పెండింగ్ లో ఉంచారు. మిగిలిన వాటిలో 144 దరఖాస్తులను రుణాలకు గుర్తించారు. కాగా వాటిలో 119 మంది అర్హత పొందారు. వీరికి ప్రభుత్వం తరపున 79 లక్షల 25 వేలు సబ్సిడీ విడుదల కానుండగ బ్యాంకర్లు మరో 79.లక్షల 25 వేలు లింకేజ్ గా రుణాలు అందివ్వనున్నారు. అయితే దరఖాస్తుల స్వీకరణ, ఇంటర్వ్యూలు, ఎంపిక లాంటి అన్ని కార్యక్రమాలు పూర్తి అయి నెలలు గడుస్తున్నా ఇంకా లబ్ధిదారులకు రుణాలు చేతికందలేదు. కారణం ప్రభుత్వం ఇంకా సబ్సిడీ ధబ్బులు విడుదల చేయకపోవడమేనా...? బ్యాంకర్లు ఇవ్వాల్సిన లింకేజ్ రుణాలు సబ్సిడి డబ్బులు వచ్చాకే యిస్తారా..? అంటూ దరఖాస్తు దారులు ప్రశ్నించుకుంటున్నారు. అదే సమయంలో కార్పొరేషన్ రుణాలు చేతికందేదెప్పుడో అని వేచి చూసే పనిలో పడ్డారు. ఇదిలా ఉండగా సోమవారం నాటికి మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రుణాలకు ఆన్లైన్‌లో దరఖాస్తులు స్వీకరణ ముగిసే నాటికి మండలంలోని ఏడు బ్యాంకుల ద్వారా 83 రుణాలు టార్గెట్ ఇవ్వగా 82 దరఖాస్తులు వచ్చాయని అధికారికంగా సంబంధిత అధికారులు తెలిపారు. బిసి కార్పొరేషన్ రుణాలకే ఇంత ఆలస్యం అయితే మైనార్టీ రుణాలు లబ్ధిదారులకు ఎప్పుడు అందుతాయో... వేచి చూడాలి.

మహానాడును జయప్రదం చేయండి

విశాలాంధ్ర-గూడూరు: కడపలో నిర్వహించనున్న మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పిలుపునిచ్చారు.గూడూరు పట్టణంలోని గమళ్ళపాలెంలో ఉన్న క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ మహానాడు విజయవంతంపై పార్టీ నాయకులతో సమావేశమయ్యారు.కడపలో మూడు రోజుల పాటు జరిగే మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. నియోజకవర్గం నుండి ఐదు వేల మందికి మహానాడుకు వచ్చేలా నాయకులు చొరవ తీసుకోవాలని సూచించారు.గూడూరులో జరిగిన మినీ మహానాడు విజయవంతం అయ్యేందుకు మీరందరి కృషి కారణమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శీలం కిరణ్ కుమార్,పులిమి శ్రీనివాసులు,వెంకటేశ్వర్లు రాజు, భాస్కర్ రెడ్డి,కిషోర్ నాయుడు,వాటంబేటి శివకుమార్,లీలావతి తదితరులు పాల్గొన్నారు.

సిపిఆర్‌పై అవగాహన అవసరం

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్: ప్రపంచ అత్యవసర వైద్య దినోత్సవం మే 27 సందర్భంగా మంగళంలోని తిరుపతి రవాణా శాఖాధికారి కార్యాలయం (ఆర్టిఓ) సహకారంతో కార్డియో పల్మనరీ రిససిటేషన్ (సిపిఆర్), బేసిక్ ఫస్ట్ ఎయిడ్ స్కిల్స్ శిక్షణా కార్యక్రమాన్ని అమర్ ఆసుపత్రి తిరుపతి వారు ఏర్పాటు చేయనున్నారని సిపిఆర్ పై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని ప్రాంతీయ రవాణా శాఖాధికారి మురళి మోహన్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నట్లు అత్యవసర సమయంలో ప్రాణాలు నిలబెట్టే ప్రక్రియ పట్ల ప్రజలకు అవగాహన పెంచడం, ప్రాణాలను పరిరక్షించే అత్యవసర ప్రతిస్పందన నైపుణ్యాలను ప్రోత్సహించడం ఈ శిక్షణా శిబిరం యొక్క లక్ష్యంగా జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ తెలియజేశారు. వరల్డ్ ఎమర్జెన్సీ మెడిసిన్ డే ప్రపంచవ్యాప్తంగా అత్యవసర సంరక్షణ ప్రదాతలు అందించే అచంచల అంకితభావం, క్లిష్టమైన సేవలను గౌరవిస్తుందని, ప్రభావితం చేస్తుందని ఆయన అన్నారు. ఆర్థోపెడిక్ విభాగాధిపతి డా. ప్రసాద్ గౌరినేని, మేనేజింగ్ డైరెక్టర్ డా. రమాదేవి గౌరినేని, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి, అమర ఆసుపత్రి అత్యవసర విభాగాధిపతి డా.శివరామ కృష్ణారెడ్డి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అమర ట్రామా సిస్టమ్ (ఏటిఎస్) సేవల ద్వారా వ్యక్తులకు ముఖ్యమైన అత్యవసర ప్రతిస్పందన పరిజ్ఞానంతో సాధికారత కల్పించడం వారి సమిష్టి దార్శనికత ఈ కార్యక్రమ శిక్షణకు ముఖ్యంగా వాహనదారులు హాజరుకావాలని ఆయన తెలిపారు.

యోగాంధ్ర క్యాంపెయిన్ ప్రారంభం

విశాలాంధ్ర-తిరుపతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యోగాంధ్ర క్యాంపెయిన్ యోగా పోటీ ప్రణాళిక ప్రకారం నగరపాలక సంస్థ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో యోగా పోటీలు నిర్వహించ బడతా యని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. ఈ కార్య క్రమం ద్వారా విద్యార్థులు మరియు పౌరులు ఆరోగ్యకరమైన జీవన శైలిని అవలంబించేందుకు ప్రోతాగిస్తున్నామని తెలిపారు. ఈ పోటీలు మే 26 నుంచి జూన్ 18వ తేదీ వరకు నిర్వహించబడతాయని తెలిపారు. ఇందులో వ్యక్తిగత, గ్రూప్ ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు మరియు జ్ఞానపరమైన పోటీలు నిర్వహించ బడతాయని తెలిపారు. పోటీల స్థాయులు తేదీలు1.వార్డు స్థాయి: మే 26 మే 30, 2025 థీమ్: ప్రతి ఒక్కరికీ యోగా గ్రామస్థాయి ఆరోగ్యమేలనం 2. నగర స్థాయి: జూన్ 2 జూన్ 7, 2025 థీమ్: యోగా ద్వారా ఐక్యత సమాజాలను కలపడం3.జిల్లా స్థాయి: జూన్ 9 జూన్ 14, 2025థీమ్: యోగా యువత ఆరోగ్య భవిష్యత్ నిర్మాణం4.రాష్ట్ర స్థాయి గ్రాండ్ ఫినాలే: జూన్ 16 - జూన్ 18, 2025 థీమ్: యోగంధ్ర ఆంధ్రప్రదేశ్ గ్లోబల్ యోగా ప్రదర్శన పోటీల తేదీలు.జూనియర్స్(10 నుండి 18 సంవత్సరాల వయస్సు)26 వ తేదీ ఉదయం 7.30 నుండి సాయంత్ర 6గంటల వరకు సోలో యోగా, అసనాస్, సూర్య నమస్కారం, ప్రాణాయామం, ధ్యానం. మిడిల్ ఏజ్ (19 నుండి 35 వయస్సు), సీనియర్స్ (35 సంవత్సరాల పైబడిన వారు.) 27 వ తేదీ ఉదయం 7.30 నుండి సాయంత్రం 6 గంటల వరకు సోలో యోగా, అసనాస్, సూర్య నమస్కారం, ప్రాణాయామం, ధ్యానం. జూనియర్స్, యంగ్, సీనియర్స్28, 29 తేదీల్లో ఉదయం 7.30 నుండి సాయంత్రం 6 గంటల వరకు యోగా, యోగా సాంగ్స్, పెయింటింగ్, యోగా స్కిట్, రోల్ ప్లే.జూనియర్స్, యంగ్, సీనియర్స్30 వ తేదీ ఉదయం 7.30 నుండి సాయంత్రం 6 గంటల వరకు యోగా క్విజ్, పోస్టర్, స్లోగన్, షార్ట్ ఫిలిం, ఫోటోగ్రఫీ పై పోటీలు నిర్వహిస్తారు. ఈ పోటీలను ఆయా వార్డుల్లో నిర్వహిస్తారని తెలిపారు. సచివాలయ, నగర మరియు జిల్లా స్థాయిల్లో కమిటీలను ఏర్పరచి పోటీలు నిర్వహించబడతాయి. పాల్గొనదలచిన వారు సచివాలయ కార్యదర్శి, నగరపాలక సంస్థ మరియు జిల్లా స్థాయి నోడల్ అధికారుల ద్వారా రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. యోగాంధ్ర క్యాంపెయిన్ ద్వారా యువతకు ఆరోగ్యాన్ని, సాంస్కృతిక మౌలిక విలువలను బోధించడమే లక్ష్యం. ఇది ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో ఒక పునాది వేస్తుంది.

వినతలకు నాణ్యతగా పరిష్కారం చూపాలి

జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, పిజిఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన వినతులను నాణ్యతతో పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ నందు ఏర్పాటు చేశారు. ఉదయం 10 నుండి మధ్యాహ్నం 2 గంట వరకు నిర్వహించిన ప్రజా వేదిక ఆవరణంలో అర్జీదారుల సమస్యలను సావధానంగా వింటూ అర్జీలు స్వీకరించారు. జిల్లాలోని డివిజన్, మండల స్థాయి వరకు ఆర్డీవోలు తాసిల్దారులు, ఎంపిడిఓలు తదితర అధికారుల వీడియో కాన్ఫరెన్స్ అనుసంధానంతో అర్జీదారుల సమస్యలపై అధికారు లతో అక్కడికక్కడే వర్చువల్ విధానంలో మాట్లాడి పరిష్కారం చూపుతున్నారు. ఈ సందర్భంగా పీజి ఆర్ఎస్ అర్జీలను నిర్దేశిత గడువులోపు పరిష్కరిం చాలని, పెండింగ్ అర్జీలను నిర్ణీత గడువులోగా అర్థవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికా రులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తో పాటు డిఆర్ఓ నరసింహులు, డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్ర రెడ్డి, శివశంకర్ నాయక్, రోజ్ మాండ్, సుధారాణి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. శాఖల వారీగా అర్జీల వివరాలు : రెవెన్యూ- 150, అటవీశాఖ -2, పంచాయతీరాజ్ -20, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ -8, పాఠశాల విద్యాశాఖ -5, పోలీస్ -12, రూరల్ డెవలప్మెంట్ -5, సివిల్ సప్లై -15, ఆర్టీసీ -4, అస్పేరిస్ -6, జాతీయ రహదారులు -7, పబ్లిక్ హెల్త్ -1, ఎస్సీ కార్పొరేషన్ -1, సర్వే -8, రిజిస్ట్రేషన్ శాఖ -4, మత్స్యశాఖ -1, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ -1, ఎండో మెంట్ -1, విద్యుత్ శాఖ -8, జలవరుల శాఖ -1, సాంఘిక సంక్షేమ శాఖ -1, ఐటీ -1, కో-ఆపరేటివ్ సొసైటీస్ -1, లేబర్ డిపార్ట్మెంట్ -2, బిసి వెల్ఫేర్ -1, హార్టికల్చర్ -1, ఆర్ అండ్ బి -1 వెరసి మొత్తం 268 వినతులు రావడం జరిగిందని సంబంధిత అధికారులు అందరూ వచ్చిన అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టి వేగవంతంగా పరిష్కరించాలని స్పందనకు హాజరయిన వివిధ శాఖలకు సంబందించిన జిల్లా అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

గిట్టుబాటు ధర కోసం మామిడి రైతులు నిరసన

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్: తిరుపతి జిల్లా మామిడి రైతులమైన మేము ప్రభుత్వ సలహాలు, సూచనలు మేరకే జిల్లాల విస్తారంగా, విజయవంతంగా మామిడి పంటను సాగు చేశామని, మామిడి సాగులో సంరక్షణ కొరకు కాపలా, దుక్కిదున్ను వాహనాల డీజిల్, ఎరువులు, క్రిమిసంహారక మందుల వినియోగం, కాపు కోత కూలీలు మొదలగు ఖర్చులతో రైతులు దివాలా తీస్తున్నారని ఆవేదన చెందుతున్నారని వారు వాపోయారు. అన్ని ఓర్చి పంటకోసి విక్రయించినప్పటికీ ధరలు ఆశాజనకంగా లేదని ధరలు లేక కాయలు కోయకపోతే కాయలు పాడైపోతున్నాయని మార్కెట్లు దళారులు రైతులను నిలువైన ముంచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తోతాపూరి మామిడికి రూ.15 కనీస మద్దతుధర కల్పించాలని, మార్కెట్ యాజమాన్యం రోజు వారి రేట్లు డిస్ప్లే చేయాలని కోరారు. ప్రభుత్వం చొరవ తీసుకొని మామిడి రైతులకు కనీస గిట్టుబాటు ధర కల్పించాలని తిరుపతి జిల్లా మామిడి తోటల రైతులు జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్‌ని కోరి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మామిడి రైతులు చంద్రశేఖర్, మనోహర్ రెడ్డి, బాల శంకర్, నాగిరెడ్డి, రమేష్, చంద్రబాబు, మధు నాయుడు, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 37 వినతులు

విశాలాంధ్ర-తిరుపతి: తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కు 37 వినతులు వచ్చాయని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఫోన్ ద్వారా పది మంది తమ సమస్యలు తెలుపగా, 27 మంది నేరుగా వచ్చి వినతులు సమర్పించారు. తమ వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలని డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, ఆర్.సి. మునికృష్ణ, కార్పొరేటర్లు శైలజ, నరసింహ ఆచారి, నరేంద్రలు కమిషనర్‌ను కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రైల్వే స్టేషన్, తదితర ప్రాంతాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, నెహ్రూవీధిలో ఇంటి కొళాయి తొలగించినా బిల్లు వస్తోంది పరిష్కరించాలని, శ్రీకృష్ణ నగర్ లో చర్చి నుండి వచ్చే శబ్దాల వలన ఇబ్బందులు పడుతున్నాము పరిష్కరించాలని, రాఘవేంద్ర నగర్ నందు వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, రవీంద్ర నగర్, వెంకటేశ్వర కాలని నందు సిసి రోడ్లు, నీటి సౌకర్యం కల్పించాలని కోరారని తెలిపారు. ఆయా సమస్యలను విభాగాల వారికి పంపి వెంటనే పరిష్కరించాలని ఆదేశించామని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, డీసీపీ మహాపాత్ర, ఫైర్ డి.ఈ.లు, ఏసిపి లు, శానిటరీ సూపర్ వైజర్లు ఉన్నారు.

సంక్షేమం మా బాధ్యత.. ఆర్టీసీ ఆదాయం పెంచడం కార్మికుల బాధ్యత

రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ తిరుమలరావు

విశాలాంధ్ర-సత్యవేడు: ఆర్టీసీ సంస్థలో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమను చూడడం మా బాధ్యత అయితే ఖర్చులను తగ్గించుకొని ఆర్టీసీ ఆదాయాన్ని పెంచడంలో కార్మికులు బాధ్యతగా తీసుకోవాలని రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ తిరుమలరావు చెప్పారు. సోమవారం ఆర్టిసి ఎండి తిరుమలరావు, స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సత్యవేడు డిపోను సందర్శించారు. ముఖ్య అతిథులుగా విజయవాడ ఆర్టిసి ఈడి చెంగల్ రెడ్డి, తిరుపతి ఆర్టీసీ ఆర్ఎం వెంకట్రావు, ఎగ్జిక్యూటివ్ ఆపరేటర్ అప్పలరాజు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్టీసీ గ్యారేజ్లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆర్టిసి ఎండి తిరుమల రావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ కార్మికుల సంబంధించి డ్రా చేసిన పిఎఫ్,సిసిఐ సొమ్ము దాదాపు రూ.996 కోట్లను తిరిగి జమ చేసినట్టు పేర్కొన్నారు. అలాగే విధులు నిర్వహిస్తూ ప్రమాదంలో కార్మికులు చనిపోతే బాధిత కుటుంబాలకు ఒక కోటి రూపాయలను చెల్లిస్తున్నామన్నారు. అలాగే కార్మికులకు అవసరమైన సంక్షేమాన్ని అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అయితే ఆర్టీసీ ఆదాయాన్ని పెంచడానికి కార్మికులందరూ కృషి చేయాలన్నారు. ప్రధానంగా బస్సులో నిర్వహణ ప్రధానమన్నారు. మార్గ మధ్యలో బస్సులు నిలిచిపోకుండా చూడాల్సిన బాధ్యత గ్యారేజ్ సిబ్బందిపై ఉన్నట్టు ఆయన గుర్తు చేశారు. ప్రతినెల మూడో సోమవారం ప్రయాణికులకు ఆర్టీసీ అందిస్తున్న సేవలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఆర్టీసీ కండక్టర్లు,డ్రైవర్లు ప్రయాణికుల పట్ల గౌరవప్రదంగా వ్యవహరిస్తూ గమ్యస్థానాలకు చేర్చడంలో ఆర్టీసీ కీలక పాత్ర పోషించే పరిస్థితి రావాలన్నారు.ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ సత్యవేడు డిపోకు సంబంధించి గతంలో ఉన్న సమయపాలన ఇప్పుడు లేదన్నారు. సత్యవేడు ఆర్టీసీ బస్సుల కోసం వివిధ రూట్లో వేచి ఉండేవారని, కానీ ప్రస్తుతం నిర్వహణ గాడి తప్పడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురి అవుతున్నట్టు ఆయన ఆరోపించారు. ముఖ్యంగా సత్యవేడు టు తిరుమల బస్సు సర్వీసులను తిరుపతికి పరిమితం అవుతున్న విషయాన్ని ఆర్టీసీ ఎండీ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే సత్యవేడు నుంచి విజయవాడకు బస్ సర్వీస్ నడపాలని ఆయన కోరారు. డిపోను దత్తత తీసుకొని అభివృద్ధి చేయాలని ఆయన ఎండి తిరుమలరావుకు విజ్ఞప్తి చేశారు. తదనంతరం డిపోలో ఇంధనం పొదుపు సంబంధించి స్థానిక ఆర్టీసీ డ్రైవర్లు సురేష్, వీరయ్య, మధు తదితరులకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంతో కలిసి ఎండి తిరుమలరావు ప్రశంసాపత్రం, ప్రోత్సాహక బహుమతులు అందించారు. అనంతరం ఆర్టీసీ కార్మిక నేతలు పలువురు ఎండి తిరుమలరావుకు పుష్పగుచ్ఛం ఇచ్చి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రామస్వామి, టిడిపి మాజీ మండలాధ్యక్షుడు పరమశివం, మురళి (చికెన్ చిన్న), గణేష్, అంబేద్కర్ అసోసియేషన్ మండలాధ్యక్షుడు రమణ, సభ్యులు అడ్వకేట్ రాజా, జనసేన నాయకుడు బాలమురళీకృష్ణ, ఆర్టీసీ డిపో అధికారులు తదితరులు పాల్గొన్నారు.